సాగర తీరంలో.. యోగాభ్యాసం!



సూర్యోదయాన సాగర తీరం యోగాభ్యాసకులతో కళకళలాడింది. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పది లక్షల మందిని యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో 45 నిమిషాలు రోజూ యోగాను సాధన చేస్తే జీవితాంతం ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీపీవో వెంకటనాయుడు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు, పశు సంవర్ధకశాఖ డీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- కొత్తపట్నం, ఆంధ్రజ్యోతి



జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాణిక్యరావు

● రిమ్స్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అశోక్‌కుమార్ నియామకం

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాణిక్య రావు, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి.అశోక్ కుమార్‌లను నియమిస్తూ వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ.కృష్ణబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా, రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న డాక్టర్ ఎ.ఏడుకొండలరావును విజయవాడ సీఎంసీ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావును ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. విజయవాడ ఎస్ఎంసీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.అశోక్ కుమార్‌ను రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు.



వ్యవసాయ డ్రోన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

రైతులకు యంత్ర చేయూత

● రూ.100 కోట్లతో పరికరాలు ● మంత్రి డాక్టర్ స్వామి

కొండపి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా రైతుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో యంత్ర పరికరాలను అందజేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలం సురారెడ్డిపాలెంలో రైతులకు సబ్సిడీపై డ్రోన్లు, ట్రాక్టర్ అనుబంధ పరికరాలు, వ్యవసాయ ఉపకరణాలు ఆదివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మారిటైం బోర్డు చైర్మన్ సత్య పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామస్థాయి కిసాన్ సమాఖ్య సంఘాల ద్వారా రైతులకు డ్రోన్లు అందజేసి వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ టంగుటూరు మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం

ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో షైనింగ్ స్టార్‌లుగా ఎంపికైన 278 మంది విద్యార్థులకు ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని పెళ్లూరు సాయిబాబా సెంట్రల్ స్కూలు అవరణలో సోమవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారు. జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పొరేషన్ల చైర్మన్లు, పీడీసీసీ, డీసీఎంఎస్ బ్యాంకు చైర్మన్లు, అధికారులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించనున్నారు.

ఇళ్లన్నీ పన్ను పరిధిలోకి!

అండర్ అసెస్‌మెంట్‌లపై కార్పొరేషన్ దృష్టి

● గత ప్రభుత్వంలోని గూడు పుఠానీకి చెక్
● కొత్తగా పన్ను కోసం 350 దరఖాస్తులు
● వాటి ద్వారా ఓఎంసీకి రూ.44 లక్షల ఆదాయం
● నాలుగు నెలల్లో రూ.8.5 కోట్ల రాబడి లక్ష్యం
● డీఎంఏ ఆదేశాలతో 'నక్ష' సర్వేకు దిగిన అధికారులు

అరకొర ఆదాయంతో అల్లాడుతున్న ఒంగోలు కార్పొరేషన్ ఆర్థిక వనరులపై దృష్టి పెట్టింది. నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని దారులను అన్వేషిస్తోంది. సరిపడా నిధుల సేకరణకు కంకణం కట్టుకుంది. అందుకోసం కీలకమైన పన్ను లీకేజీలపై కేంద్రీకరించింది. గత ప్రభుత్వంలో పన్ను వసూళ్లలో జరిగిన అవకతవకలను అరికట్టేందుకు చర్యలకు ఉపక్రమించింది. 'నక్ష' సర్వేతో ప్రతి ఇల్లూ జల్లెడ పడుతోంది. రెవెన్యూ అవకతవకలను అరికట్టి, కార్పొరేషన్ ఆదాయాలను పెంచుకోవాలని గతనెల 17వ తేదీన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటర్ (డీఎంఏ) ఆదేశించడంతో అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల కమిషనర్లు ఆ దిశగా చర్యలకు దిగారు. అందులో భాగంగా నగరంలో విస్తృతంగా సర్వే నిర్వహించి, పన్నులేని ఇళ్లను గుర్తించి వసూలు చేయనున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)




ఒంగోలులో ఇంటికి పన్ను విధించేందుకు కొలతలు చూస్తున్న సిబ్బంది

ఏడాదికి రూ.50 కోట్ల పన్ను వసూలు లక్ష్యం

ఒంగోలులో సుమారు 80వేల గృహాలున్నాయి. మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. కార్పొరేషన్ రికార్డుల ప్రకారం 66,200 ఇళ్ల నుంచి పన్ను వసూలవుతోంది. మిగిలిన ఇళ్ల నుంచి కూడా పన్ను వసూలు చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. మొత్తం 46 రెవెన్యూ వార్డులకు సంబంధించి ఒక అధికారి, నలుగురు ఆర్ఐలు ఉన్నారు. 70 మంది సచివాలయ సెక్రటరీలు పనిచేస్తున్నారు. వీరి ద్వారా రెవెన్యూ లీకేజీని అరికట్టి ఆదాయ పెంపు కోసం విస్తృతంగా సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు ఏడాదికి సుమారు రూ.40 కోట్లు పన్నుల రూపంలో కార్పొరేషన్‌కు ఆదాయం లభిస్తోంది. ప్రతి ఇంటికీ పన్ను విధించి ఆ ఆదాయాన్ని రూ.50 కోట్లుకు పెంచేందుకు కార్పొరేషన్ సిద్ధమైంది.

సెప్టెంబరు 30 నాటికి ప్రక్రియ పూర్తి

డీఎంఏ ఆదేశాలతో పూర్తిస్థాయిలో పన్నులు విధించడంతోపాటు, గత ప్రభుత్వం హయాంలో పన్ను వసూళ్లలో అవకతవకలు, కొలతల్లో మతలబుల లెక్కలు తీస్తున్నారు. మే 17వ తేదీన డీఎంఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఒంగోలు కార్పొరేషన్‌కు రూ.8.5 కోట్లు పెంపు లక్ష్యం విధించారు. ఈప్రక్రియ సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ దిశగా నగరంలోని పన్నులేని ఇళ్లను గుర్తించి పన్ను విధిస్తున్నారు. మంగళవారం నాటికి కొత్తగా పన్ను వేయాలని 350 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా కార్పొరేషన్‌కు రూ.44 లక్షల డిమాండ్ పెరిగింది.



ఒక్క ఇల్లు వదిలినా సెక్రటరీదే బాధ్యత

ప్రతి ఇంటికీ పన్ను విధించే ప్రక్రియలో సెప్టెంబరు 30కి పూర్తి చేయాలి. ఆ తర్వాత ఏదైన ఇంటికి పన్ను విధించకుండా వదిలేస్తే సంబంధిత సెక్రటరీపై చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగా ఆ ఇంటికి గడిచిపోయిన రెండున్నర సంవత్సరాల పన్ను ఎంత అయితే విధిస్తారో అంతే పన్ను ఆ ప్రాంత సచివాలయ సెక్రటరీ నుంచి వసూలు చేస్తారు. దీంతో సంబంధిత రెవెన్యూ వార్డు ఆర్ఐ, సచివాలయ సెక్రటరీలు ప్రతి ఇంటినీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పన్నుల్లో తేడాలుంటే తిరిగి కొలతలు వేసి లోపాలను గుర్తిస్తున్నారు.

థర్డ్ పార్టీ సర్వే నివేదిక ఆధారంగానే

గడువు ముగిసిన తర్వాత నగర పరిధిలో గతంలో పన్నులు వసూలు, కొత్తగా విధించిన పన్నులపై నివేదికను డీఎంఏకు అందజేయాల్సి ఉంది. దీంతో కమిషనర్ నివేదిక ఆధారంగా రాష్ట్ర పురపాలక శాఖ ఇతర మునిసిపాలిటీలు, కార్పొరేషన్ ఉద్యోగులను థర్డ్ పార్టీగా నియమించి, వాస్తవాలపై రీ సర్వే చేయనున్నారు. వారిచ్చే నివేదికల ఆధారంగా ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల లక్ష్యాలు, పూర్తి స్థాయి పన్ను విధింపులపై డీఎంఏ సర్టిఫికెట్ మంజూరు చేయనున్నారు. మొత్తంగా ప్రభుత్వం అందించే వివిధ గ్రాంట్‌లతోనే కాకుండా స్థానికంగా ఆదాయాన్ని పెంపొందించుకుని పట్టణాల ప్రగతి సాధించేలా పురపాలక శాఖ భావిస్తోంది.

407 మందికి ఉద్యోగోన్నతి

● గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 104 మంది టీచర్లు ● స్కూలు అసిస్టెంట్లుగా 303 మంది



ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో 407 మంది ఉపాధ్యాయులకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా, స్కూలు అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి లభించింది. 104 మంది స్కూలు అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా, 303 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీఈటీ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ లభించింది. హైస్కూలు హెచ్‌ఎంలుగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులు 100 శాతం ఉద్యోగోన్నతులతో భర్తీ అయ్యాయి. ఇద్దరు స్కూలు అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొంది హెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించి ఆరోజే ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ రెండు స్థానాలను కూడా తర్వాత ఉద్యోగోన్నతి ద్వారా నింపారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని హైస్కూళ్లకూ నూరు శాతం హెచ్‌ఎం పోస్టులు భర్తీ అయ్యాయి.

ఎస్ఏలలో 70 శాతం భర్తీ

సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీఈటీలు, భాషా పండితులకు పీఎస్ హెచ్‌ఎంలుగా, స్కూలు అసిస్టెంట్లుగా 70 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. అర్హులైనవారు లభించకపోవడంతో 30 శాతం స్కూలు అసిస్టెంట్ ఉద్యోగోన్నతుల పోస్టులు మిగిలిపోయాయి. వీటిలో సగానికిపైగా ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లోనే ఉన్నాయి. స్కూలు అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులకు సంబంధించి ప్రభుత్వ యాజమాన్యంలో 81, జడ్పీ యాజమాన్యంలో 287, మునిసిపాలిటీల్లో 37, ఒంగోలు కార్పొరేషన్‌లో 27 కలిపి 432 పోస్టులు ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 303 పోస్టులు భర్తీ చేశారు. 129 పోస్టులకు అర్హులైనవారు లభించకపోవడంతో భర్తీ కాకుండా ఉండిపోయాయి. ప్రభుత్వ యాజమాన్యంలో 81 పోస్టులకు కేవలం 13 మాత్రమే భర్తీ కాగా 68 ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిషత్ యాజమాన్యంలో 287 పోస్టులకు 251 భర్తీ కాగా 36 మిగిలిపోయాయి. మునిసిపాలిటీల్లో 37 పోస్టులకు 25 భర్తీ కాగా 12 మిగిలిపోయాయి. కార్పొరేషన్‌లో 24 పోస్టులకు 14 భర్తీ కాగా 13, జడ్పీ యాజమాన్యంలో 33 ఫిజికల్ డైరెక్టర్లు, 3 పీహెచ్‌ఎం పోస్టులు మిగిలిపోయాయి. ప్రభుత్వ యాజమాన్యంలో స్కూలు అసిస్టెంట్లు 13, పీఎస్ 12, బీఎస్ 10, సోషల్ 10, ఫిజికల్ డైరెక్టర్ 15, స్పెషల్ ఎడ్యుకేషన్ 4, సోషల్ ఉర్దూ, బీఎస్ ఉర్దూ, గణితం ఉర్దూ, గణితం తెలుగు ఒక్కో పోస్టు చొప్పున ఖాళీగా ఉండిపోయాయి.



కలెక్టరేట్ గేటును నెట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఉపాధ్యాయులు

టీచర్ల ఆగ్రహ జ్వాల

● డీఈవో కార్యాలయం ముట్టడి ● రోడ్డుపై బైఠాయించి నిరసన

ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు, భాషా పండితులు, పీఈటీలకు వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ టీచర్లు ఆదివారం రోడ్డెక్కారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి భారీగా హాజరై స్థానిక ప్రకాశం భవనం ఎదుట నిరసన తెలిపారు. ఎండలో మహిళా టీచర్లు బైఠాయించి గట్టిగా నినాదాలు చేశారు. బదిలీల కౌన్సెలింగ్‌లో తమకు న్యాయం చేయాలని, వెబ్ కౌన్సెలింగ్ కాకుండా.. అధికారులు ఇచ్చిన మాటకు కట్టుబడి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకురాలు సీహెచ్ మంజుల మాట్లాడుతూ బదిలీల సీనియారిటీలోని తప్పులు సవరించి సక్రమమైన జాబితాలు ప్రకటించాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు. యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులెవరూ వెబ్ ఆప్షన్ల జోలికి వెళ్లకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ సాధించే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నందున మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఆపస్ రాష్ట్ర నాయకులు సీహెచ్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో మంత్రి లోకేష్ వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఇంజనీరింగ్‌లో 69 శాతం అర్హత

● రాష్ట్ర సగటు కంటే 3 శాతం వెనుకబడిన జిల్లా

ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. జిల్లా విద్యార్థులు ఇంజనీరింగ్ ప్రవేశాలకు 69 శాతం మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 92 శాతం మంది అర్హత పొందారు. ఇంజనీరింగ్‌కు 10,603 మందికి విద్యార్థులు పరీక్షలు రాయగా 7,332 మంది అర్హత సాధించారు. అర్హత సాధనలో రాష్ట్రస్థాయి సగటుకంటే జిల్లా విద్యార్థులు మూడు శాతం వెనుకబడి ఉన్నారు. బాలురు 5,850 మంది పరీక్ష రాయగా 3,973 మంది అంటే 68 శాతం, బాలికలు 4,753 మందికి 3,359 మంది అంటే 69 శాతం మంది ప్రవేశాలకు అర్హత సాధించారు. అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర సగటు కంటే జిల్లా విద్యార్థులు 2 శాతం అదనంగా 92 శాతం మంది క్వాలిఫై అయ్యారు. బాలికలు 2,216 మందికిగాను 2,064 మంది అంటే 93 శాతం అర్హత సాధించారు. బాలురు 911 మందికి 819 మంది అంటే 90 శాతం మంది అర్హత సాధించారు.

వైభవంగా..

పాత సింగరాయకొండ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం
హంస వాహనంపై భక్తులకు దర్శనం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

5

వీడుతున్న మిస్టరీ

● రాజా హత్యకు బాలిక విషయంలో వివాదమే కారణం?

5

మాన్యువల్ కౌన్సెలింగ్ సాధనకు ఉద్యమం

నేడు జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు
రేపు కమిషనర్ కార్యాలయం ముట్టడి

5

శ్రీచైతన్య విద్యార్థుల హవా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఏపీసెట్-2025లో ఫలితాల్లో ఒంగోలులోని శ్రీచైతన్య విద్యార్థులు రాష్ట్ర, జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎం.సౌమ్యశ్రీ 426వ ర్యాంకు, వి.విజయవర్ష 2,990, జి.శాంతి 3,270, ఎస్వీ.కృష్ణసాయి 4,579, బైపీసీ విభాగంలో కె.లలిత విజయకుమారిచౌదరి 4,876 ర్యాంకు సాధించారు. 5వేల లోపు ఐదుగురు, 7వేల లోపు ర్యాంకులను 19మంది, 10వేల లోపు ర్యాంకులను 37మంది, 30వేల లోపు ర్యాంకులను 84 మంది విద్యార్థులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక కళాశాలలో ఆదివారం బ్రాంచి డీన్ ఎం.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్‌లు అభినందిచారు.

నాగార్పమ్మ ఆలయంలో 'సత్య' పూజలు

కొండపి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చిరుకూరుపాడులో జరుగుతున్న నాగర్పమ్మ కొలుపుల్లో ఆదివారం మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సత్తాచాటిన శ్రీపతిభ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(విద్య), జూన్8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో ఒంగోలు లోని శ్రీప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బత్తిన స్వాతి 1071, కాకర్ల మణిచందు 2807, పి.విష్ణు 3,376, కె.వెంకటకళ్యాణ్‌రామ్ 3,875, పి.వెంకటపవన్ 5,602, డి.స్నే హరెడ్డి 5,664, బత్తిన చరణ్‌తేజ్ 5,838, వి.శ్రీసాయిచందన 6,155, పి.గణేష్‌రెడ్డి 6,716, ఎన్. లక్ష్మీదీపిక 7,558 ర్యాంకు సాధించారు. అలాగే నలుగురు 5వేలలోపు, 13మంది 10వేలలోపు, 38మంది 15వేలలోపు, 64మంది 20వేలలోపు ర్యాంలకు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాశ్‌నారాయణ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీఈఏపీసెట్‌లో శ్రీసరస్వతి విజయభేరి


ఆర్.సుకుమార్‌సాయి, కె.గుణశేఖరరెడ్డి, కె.లోకక్రితి

ఒంగోలు(విద్య), జూన్8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్-2025 ఇంజినీరింగ్ విభాగం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగర వేశారు. ఆర్.సుకుమార్ సాయి 625ర్యాంక్ సాధించి ప్రథమ స్థానంలో నిలిశారు. కె.లోకక్రితి 897 ర్యాంక్, కె.గుణశేఖరరెడ్డి 935, ఎస్.ఇంద్రసేనారెడ్డి 1044, బి.హర్షిణి 1186, జి.ఝాన్సీలక్ష్మి 1540, ఆర్.సాయిమణికంఠరెడ్డి 1638 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు ముగ్గురు, 9మంది 2వేలలోపు, 24మంది 5వేలులోపు, 56మంది 10వేలలోపు ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఉత్తమర్యాంకలు సాధించిన విద్యార్థులను స్థానిక శ్రీసరస్వతి విద్యాసంస్థలో చైర్మన్ ఏపీ.రమణారెడ్డి, డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరెడ్డి, సీఈవో ఎస్వీ.సురేష్, డీన్‌లు, ప్రిన్సిపాల్స్ ప్రత్యేకంగా అభినందించారు.

12న మాక్ వెబ్ కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థుల కోసం బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన స్థానిక ఎ1 కన్వెన్షన్‌హాలులో ప్రత్యేకమాక్ వెబ్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత న్యామతుల్లాబాషా తెలిపారు. ఆదివారం ఒంగోలులోని బ్రిలియంట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9 సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా ఇద్దరికి ల్యాప్‌టాప్‌లు అందజేస్తామని చెప్పారు. వివరాలకు అంజయ్యరోడ్డులోని బ్రిలియంట్ సంస్థలో సంప్రదించాలని కోరారు. సంస్థ ఎండీ తహర, కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

నా మనుషులను కాపాడుకుంటా : బాలినేని

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): "నా మనుషులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళతానని" మాజీమంత్రి, జనసేన పార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అందుకోసం అవసరమైతే తాను ఒంగోలులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆదివారం పలు శుభకార్యాలయాల్లో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన బాలినేని విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఏమి చేసుకున్నా తనకు పనిలేదని పేర్కొన్నారు. అనంతరం నగరంతో పాటు కొత్తపట్నం మండలంలోని పలు కార్యక్రమాల్లో బాలినేని పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో పాటు వివిధ వర్గాల ప్రజలకు ఆయనను కలిశారు.

ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థులకు ర్యాంకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఉమామహేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు ఏపీఈఏపీసెట్-2025లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. టి.తనూజ 6,427ర్యాంకు, బలగాని పూజిత 13,401, ఆకుల దుర్గప్రవీణ్ 14,202, బి.ప్రసన్న 19,603, పి.హరిణిత 19,763 ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో ర్యాంకును సాధించిన విద్యార్థులను కాలేజీ డైరెక్టర్లు సి.మల్లేశ్వరరావు, సి.జయలక్ష్మి అభినందించారు.





ప్రోత్సాహక బహుమతుల ప్రదానం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జై శ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పదో తరగతిలో 500లకుపైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఐఆర్‌ఎస్ అధికారి గోసు రమేష్ హాజరై బహుమతులను అందజేశారు. విశాఖపట్నం టౌన్ ప్లానింగ్ డీడీ రోహిణి, సంస్థ వ్యవస్థాపకుడు ద్రావిడదేశం కృష్ణారావు, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, అడకా స్వాములు, రవికిరణ్, డాక్టర్ పిచ్చయ్య, గురుప్రసాద్, ఎలికా రంజిత్, బంకా చిరంజీవి, డాక్టర్ మాల్యాద్రి, వెంగయ్య, శ్రీధర్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

కొండపి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మృతి

కొండపి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొండపి పంచాయతీలోని కట్టవారిపాలెంకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బొక్కసం ఉపేంద్రచౌదరి (48) ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఏడాదిగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనకు ఆకస్మాత్తుగా శ్వాస అందకపోవడంతో ఒంగోలులోని ఓ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైసీపీ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు.

ఒంగోలు విద్యార్థికి 53వర్యాంక్

ఒంగోలు(విద్య), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరానికి చెందిన గోగినేని సాయిరోహిత్‌చౌదరికి ఏపీఈఏపీసెట్ ఫలితాలలో అగ్రి, ఫార్మసీ విభాగంలో 53వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గోగినేని నాగేశ్వరరావు, రాధ తదితరులు అభినందించారు.

మరో విద్యార్థినికి 292వ ర్యాంక్

ఒంగోలుకు చెందిన రాజువెంకటహాసిని ఏపీఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 292వ ర్యాంక్ సాధించారు. రాజువెంకటహాసిని జిల్లా ఎన్జీవో సంఘ నాయకుడు ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి, ప్రభుత్వ టీచర్ పద్మ దంపతుల కుమార్తె. పలువురు ఆమెను అభినందించారు.







హంస వాహనంపై కొలువు దీరిన స్వామివారు


అంగరంగ వైభవంగా..

సింగరాయకొండలో లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం

హంసవాహనంపై భక్తులకు దర్శనం

సింగరాయకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహ స్వామి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పూజల అనంతరం లక్ష్మీనరసింహుడు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరారు. అనంతరం మోతకాపులు స్వామివారిని గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. భక్తులు అధికసంఖ్యలో సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రికి చదువుల తల్లి సరస్వతి అవతారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారు ఊరేగే దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషా లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చప్పరసేవ ఉంటుంది. రాత్రికి శేషవాహనంపై విహరించనున్నారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

యువకుడు దుర్మరణం

జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదుట జాతీయ రహదారిపై ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, మృతి చెందిన జగదీష్

సింగరాయకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటోను వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం స్థానిక జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదుట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన పొటేళ్ల జగదీష్ (24) పదేళ్ల నుంచి తన తల్లిదండ్రులతో కలసి అమ్మమ్మగారి గ్రామమైన ఉలవపాడు మండలం కొల్లూరుపాడులో ఉంటున్నాడు. ఆదివారం ఉలవపాడు నుంచి ఆటోలో మామిడికాయలను ఒంగోలు తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మామిడికాయల ఖాళీ కేస్‌లను తీసుకొని ఆటోలో ఉలవపాడు బయల్దేరాడు. మార్గమధ్యలో సింగరాయకొండ సర్వీస్‌రోడ్డు నుంచి జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదుట జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న గుర్తుతెలియని ట్రాక్టర్ వెనుకవైపు నుంచి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న జగదీష్ రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రక్కును అక్కడే వదిలివేసి ఇంజన్‌తో పరారయ్యాడు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సీసీకెమెరాల్లో నమోదైన ఫుటేజ్ ఆధారంగా ట్రాక్టర్ డ్రైవర్‌ను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై బి. మహేంద్ర జరిగిన ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూర సరిగా లేదని భార్యతో వివాదం

ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త

కేసు నమోదు చేసిన పోలీసులు

అద్దంకి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కూర విషయంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగి భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని చక్రాయపాలెంలో చోటుచేసుకొంది. ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు... మండలంలోని చక్రాయపాలేనికి చెందిన అంకం అమరేంద్ర, భార్య అనితల మధ్య కూర విషయంలో గత నెల 20న ఇంట్లో వివాదం జరిగింది. దీంతో అమరేంద్ర ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అమరేంద్ర తల్లి కుమారి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

అద్దంకిలో కులకలం

ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరి మధ్య సంభాషణ

ఈ క్రమంలో మరో వర్గంపై అనుచిత వ్యాఖ్యలు

ఘటనపై సమావేశమైన అవతలి వారు

క్షమాపణలకు డిమాండ్

కౌన్సెలింగ్ నిర్వహించి పంపిన పోలీసులు

అద్దంకి, జూన్8(ఆంధ్రజ్యోతి): ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతల మధ్య సంభాషణ మరో సామాజిక వర్గానికి చెందిన నేతల ప్రస్తావన రావడం, ఆ సంభాషణ వైరల్ కావడంతో అద్దంకిలో కుల అలజడి నెలకొంది. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించడంతో సమస్య సద్దుమణిగింది. అద్దంకి పట్టణంలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత, జనసేన నేతల మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ సంభాషణ మరో సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉండడంతో రెండో సామాజిక వర్గానికి చెందిన వారు అద్దంకిలోని నర్రావారిపాలెంలోని ఓ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. కుల ప్రస్తావన తెచ్చి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఘటనపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో వైరి సామాజికవర్గం కూడా సమావేశానికి సిద్ధమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదే విషయం మంత్రి రవికుమార్ దృష్టికి కూడా పోవడంతో ఆయన ఫోన్‌లో ఇరుపక్షాల నేతలతో మాట్లాడినట్లు సమాచారం. చిన్నచిన్న విషయాలకు ఘర్షణ వాతావరణం తీసుకురావద్దని హెచ్చరించినట్లు తెలిసింది.

నేటి నుంచి పాతసింగరాయకొండలో ఎడ్ల పోటీలు



పోటీలకు సిద్ధం చేస్తున్న క్రీడా ప్రాంగణం

సింగరాయకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పొటేళ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు అందజేయనున్నారు. కాగా 10వ తేదీ మంగళవారం సీనియర్ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. బుధవారం రాష్ట్ర స్థాయి రాదాడి (బండలాగుడు) పోటీలను నిర్వహించనున్నారు.

వీడుతున్న రాజా హత్య కేసు చిక్కుముడి

పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు

బాలిక విషయంలో వివాదమే కారణం?



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ(ఫైల్)

ఒంగోలు క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు రూరల్ మండలం ముక్తినూతలపాడులో జరిగిన కారు డ్రైవర్ బోడపాటి ద్రోణాచలం అలియాస్ రాజా దారుణ హత్య కేసులో చిక్కుముడి వీడుతోంది. ఇప్పటికే ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరో ముగ్గురు పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో కారుడ్రైవర్‌గా పనిచేసే రాజాకు ముక్తినూతలపాడుకు చెందిన పాతపాటి శ్రీహరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. బుల్లెట్ షోరూంలో మెకానిక్‌గా పనిచేసే శ్రీహరి ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. ఆ బాలిక తమ బంధువు కావడంతో రాజా పలుమార్లు శ్రీహరిని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయని సమాచారం. ఇటీవల స్వగ్రామం వచ్చిన రాజా ఈనెల 5న మద్యం సేవిస్తూ శ్రీహరిని కూడా పిలిచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శ్రీహరి తన నలుగురు స్నేహితులను కూడా వెంటబెట్టుకుని రాజా వద్దకు వెళ్లాడు. శ్రీహరి, అతని స్నేహితులను చూడగానే అనుమానంతో రాజా కొంత మందికి ఫోన్లు చేసినట్లు తెలిసింది. నన్ను కొట్టడానికి మనుషులను శ్రీహరి తీసుకొచ్చినట్లు కూడా చెప్పినట్లు సమాచారం. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజా మాటలను ఫోన్‌లో ఉన్న వారు పట్టించుకోలేదు. అప్పటికే మద్యం తాగిన రాజాకు మరింతగా తాగించి అతను స్పృహ తప్పిపడిపోయేలా చేశారు. ఆ వెంటనే వారు రాజాపై పెట్రోలు పోసి తగులబెట్టినట్లు పోలీసుల విచారణలో ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగింత

రాజా మృతదేహానికి ఒంగోలు రిమ్స్‌లో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీసులు.. రాజా మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అయితే రాజా మృతదేహంపై కాల్చిన గాయాలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ హత్య కేసులో ఎవరి పాత్ర ఎంత అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

2,461 మంది టీచర్లు తప్పనిసరి బదిలీ

వారిలో ఎస్‌జీటీలు 2,438 మంది



ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ తత్సమాన కేటగిరీ టీచర్లు 2,461 మంది తప్పనిసరిగా బదిలీకానున్నారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్లే 2,438 మంది ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన కారణాలతో సెకండరీ గ్రేడ్‌టీచర్లు మెజార్టీ సర్దుబాటుకు గురికాగా, కొందరు మిగులుగా తేలారు. వీరికితోడు ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పనిచేసినవారు ఉన్నారు. ఇక ఫిజికల్ డైరెక్టర్లు పోస్టుల్లో పనిచేస్తున్న 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, పది మంది భాషా పండితులు కూడా తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ఈమూడు కేటగిరిల్లోని టీచర్లు బదిలీల కోసం భారీగా దరఖాస్తు చేసుకున్నారు. సెకండరీగ్రేడ్ టీచర్లు 3,531 మంది దరఖాస్తు చేయగా వారిలో 2,438 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు కాగా 1,093 మంది అభ్యర్థన మేరకు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పీఈటీలు 32 మంది దరఖాస్తు చేయగా 12 మంది తప్పనిసరిగా బదిలీ కాగా, 20 మంది అభ్యర్థన మేరకు, బాషాపండితులు 14 మంది బదిలీకి దరఖాస్తు చేయగా వీరిలో 10 మంది తప్పనిసరి బదిలీ, నలుగురు రిక్వెస్టు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. మ్యూజిక్ టీచర్ ఒకరు బదిలీకి దరఖాస్తుచేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ సాధనకు ఉద్యమం

నేడు జిల్లాకేంద్రంలో నిరాహారదీక్ష

రేపు కమిషనరేట్ ముట్టడికి పిలుపు

ఒంగోలు విద్య. జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ సాధనకు ఉపాధ్యాయులు ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు. పాఠశాల విద్యాకమిషనర్‌తో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కమిషనర్ ప్రతిపాదనను ఐక్యవేదిక నాయకులు అంగీకరించలేదు. పోరాటాల ద్వారానే మాన్యువల్ కౌన్సెలింగ్ సాధించాలన్న లక్ష్యంతో వేదిక పోరాట షెడ్యూల్‌ను ప్రకటించింది. సోమవారం జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు, మంగళవారం విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు వేదిక నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించి చర్చించారు. సుమారు మూడువేల మంది ఎస్‌జీటీలు బదిలీలు కావాల్సి ఉంది. బదిలీల కోసం వేలల్లో ఆప్షన్లు పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని చెప్తున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని వేదిక నాయకులు, ఉపాధ్యాయులు కోరుతున్నా పట్టించుకోక పోవడంతో టీచర్లలో ఆందోళన నెలకొంది. దీంతో వేదిక రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన బాట పట్టారు.

అన్నగారి సంతకు వీడని గ్రహణం

రైతులు, కొనుగోలుదారులకు మేలు జరిగేలా నిర్వహణ

టీడీపీ హయాంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు

వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం

రైతుల స్థానంలో వ్యాపారులు

ఇంకా గాడిన పడని వైనం



అద్దంకిలోని అన్నగారి సంత

అద్దంకి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో దశాబ్దకాలం క్రితం ప్రారంభమైన అన్నగారి సంతకు గ్రహణం వీడలేదు. అప్పటి ఏఎంసీ చైర్మన్ నాగినేని రామకృష్ణ అన్నగారి సంత నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా తెచ్చుకొని అమ్ముకునేలా ఏర్పాట్లు చేశారు. రైతులకు మార్కెట్‌లో అమ్ముకునే ధర కంటే ఎక్కువ రాగా, కొనుగోలుదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు లభించాయి. ఉభయులకు మేలు జరిగింది. ముందు రోజే ధరలు నిర్ణయించి సంతలో ఆ ధరలకే అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టే వారు. అద్దంకి మార్కెట్‌యార్డు పరిధిలో అద్దంకిలో 2015 జూలై 5న సంత ప్రారంభించగా ఆగస్టు 12న మేదరమెట్ల, సెప్టెంబర్‌లో పంగులూరులో ఈ సంతల నిర్వహణ చేపట్టారు. ప్రతి ఆదివారం అద్దంకిలో, బుధవారం మేదరమెట్ల, శుక్రవారం పంగులూరులోని మార్కెట్ యార్డు గోడౌన్‌ల వద్ద సంతలు నిర్వహించారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఈ సంతలు ఒక వెలుగు వెలిగాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారి సంత పేరు కాస్తా రాజన్న సంతగా మార్చారు.అదేసమయంలో రైతుల స్థానంలో దళారులు, వ్యాపారులు రంగప్రవేశం చేశారు. సంత నిర్వహణ మొత్తం అస్తవ్యస్తం మారింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. వ్యాపారులే ఇష్టానుసారం ధరలతో అమ్మకాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారి సంతగా పేరు మార్పు చేశారు. ఏడాది గడిచినా దానినిర్వహణపై ప్రత్యేక దృష్టి చేపట్టకపోవడంతో నేటికీ వ్యాపార పందాల్లోనే సంత నడుస్తోంది. దీంతో సంత ఏర్పాటు అసలు లక్ష్యం దెబ్బతింటోంది.



మే నెల మొదటి వారంలో తీవ్ర వడగాలులకు ఎండిపోయిన చెట్టు

జూన్ మొదటి వారంలో వర్షాలతో జీవం పోసుకున్న చెట్టు

నాడు నిర్జీవం.. నేడు జీవం

కంభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే 20వ తేదీ వరకు కాచిన ఎండ వేడిమి, వడగాలులకు కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని పోలీసుస్టేషన్ క్వార్టర్స్ వెనుక భాగాన ఉన్న చెట్టు ఆకులన్నీ రాలిపోయాయి. పూర్తిగా ఎండి నిర్జీవంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు.. మోడువాడిన చెట్టు జీవం పోసుకుని ఆకుపచ్చగా మారింది.

నేడు ఐటీఐ అప్రంటీస్‌షిప్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు జిల్లాలోని వివిధ కంపెనీలు, శ్రీసిటిలోని బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని వివరించారు.ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులను అప్రంటిస్ షిప్ శిక్షణకు కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. పారిశ్రామికవేత్తలు హాజరై తమ కంపెనీల ప్రాముఖ్యతను వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణా భృతి చెల్లిస్తామని తెలిపారు. జిల్లాలోని ఐటీఐ, ఒకేషనల్ కోర్సులు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అప్రంటీష్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డీఎస్సీకి 86శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షకు 86శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఎనిమిదికిగాను ఐదుకేంద్రాల్లోనే పరీక్షలు జరిగాయి. ఈ కేంద్రాల్లో ఉదయం సెషన్ మూడు చోట్ల, మధ్యాహ్నం సెషన్ ఐదు కేంద్రాల్లో జరిగింది. పరీక్షకు 837 మంది హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరుకాగా 121 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు స్కూలు అసిస్టెంట్ హిందీ, పరీక్ష నిర్వహించారు.

రైతుల కోసం పోరాడిన మహనీయుడు రంగా

● రైతు సంఘం నాయకులు



ఆచార్య రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు(రూరల్), జూన్8(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు ఆచార్య ఎన్జీరంగా అని పలువురు రైతు సంఘం నాయకులు కొనియాడారు. ఆదివారం ఒంగోలులోని ఆచార్య ఎన్జీరంగా భవన్‌లో ఆచార్య ఎన్జీరంగా వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల రంగా కాంస్య విగ్రహానికి రైతు సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రంగాభవన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం పార్లమెంట్‌లోను, ప్రపంచ దేశాల రైతుసదస్సులలో రంగా ప్రసంగించారని తెలిపారు. చుండూరి రంగారావు మాట్లాడుతూ 1936లో ఆచార్య ఎన్జీ రంగా ఆల్ ఇండియా కిసాన్ సమాఖ్యకు కార్యదర్శిగా ఉండి రైతు ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. మహాత్మా గాంధీ పిలుపుతో ఆయన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. రంగాభవన్ కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయ నాయకుడు రంగా అని, జమిందారి వ్యవస్థ రద్దు కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. రంగాభవన్‌లో రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగినేని అవనీంద్రప్రసాద్, గుండవరపు కోటేశ్వరరావు, నన్నూరి కోటేశ్వరరావు, బోడపాటి కోటేశ్వరరావు, చుంచు శింగయ్య, మండవ మల్లికార్జునరావు, కారుమూడి ప్రభాకరరావు, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, చింతపల్లి గోవిందయ్య, కాట్రగడ్డ వెంకటకృష్ణయ్య, పొణకల శేషారావు, రైతులు పాల్గొన్నారు.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం, 9 జూన్ 2025 ప్రకాశం 4 పేజీలు

సానుకూల దృక్పథం... నిర్దిష్ట ప్రణాళిక... అహర్నిశలు కష్టపడి అనుకున్నది సాధించాలన్న లక్ష్యం.. ఇవీ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య విజయ రహస్యాలు. నిన్నటి వరకు ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులుగా, ఒంగోలులోని వెంకటరమణ నర్సింగ్ హోం నిర్వాహకునిగా సీతారామయ్య సుపరిచితులు. ఒంగోలు ప్రాంత వాసులకు తెలుగుదేశం పార్టీ అభిమానిగా, వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతగా, పురప్రముఖులకు లయన్స్ క్లబ్‌లో క్రియాశీలక వ్యక్తిగా కూడా పరిచయస్థులు. ఆయన సోమవారం నుంచి ప్రతిష్టాత్మకమైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి (చైర్మన్)గా సరికొత్త బాధ్యతల్లో ప్రజలతో మమేకం కాబోతున్నారు. సీతారామయ్యకు ఆ పదవి అంత సులభంగా దక్కలేదు. దాని వెనుక 25 ఏళ్ల కష్టం ఉంది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం, ఆపై పేరు ప్రఖ్యాతులు ఉన్న డాక్టర్ కుమారుడిగా సాఫీగా ప్రారంభమైన ఆయన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నాయి. కష్టాలు, నష్టాలు ఎదురైనా కుంగిపోకుండా దృఢసంకల్పంతో లక్ష్య సాధన వైపు అడుగులు వేశారు. డాక్టర్‌గా నిలదొక్కుకుని కుటుంబానికి అండగా నిలిచారు. ఆపై రాజకీయ అడుగులు ప్రారంభించి మాటలకన్నా చేతల ద్వారా తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటూ ఈ స్థాయికి చేరారు.

కష్టే ఫలి..

డాక్టర్ కామేపల్లి



- సానుకూల దృక్పథం.. దృఢసంకల్పం..
- ఆటుపోట్లు ఎదురైనా వెనక్కి తగ్గని నైజం
- ఐఎంఏ నేతగా.. లయన్స్ క్లబ్ ప్రతినిధిగా సేవలు
- తెలుగుదండు పేరుతో విస్తృతంగా వైద్య శిబిరాలు
- నేడు పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా సీతారామయ్య బాధ్యతల స్వీకరణ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ప్రకాశం జిల్లా ఏర్పాటుకు ఏడాది ముందు 1969లో ఒంగోలులో డాక్టర్ సీతారామయ్య తండ్రి డాక్టర్ రమణారావు వైద్యశాలను ప్రారంభించారు. స్థానికంగా వైద్యసేవలను అందిస్తూనే 1970లో కొత్తగా ఏర్పడిన జిల్లాలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి పేదలకు వైద్య చికిత్సలు అందించేవారు. శస్త్ర చికిత్సలు చేయడంలో దిట్టగా పేరొందారు. హస్తవాసి మంచిదన్న పేరు కూడా తోడు కావడంతో కొద్దికాలంలోనే వైద్యుడిగా స్థిరపడ్డాడు. తదనుగుణంగా ఆదాయ వనరులు కూడా పెరిగాయి. దీంతో తన ఇద్దరు కుమారులను డాక్టర్లుగా తీర్చిదిద్ది వెంకటరమణారావు వైద్యశాలను అభివృద్ధి చేయాలని కలలు కన్నారు. అయితే అనూహ్యపరిణామాల మధ్య 1989 అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ రమణారావు ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆతర్వాత ఆర్థిక సమస్యలతోపాటు వైద్యశాల నిర్వహణకు సమస్యలు ఎదురయ్యాయి. అదేసమయంలో ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలు పెరిగిపోయాయి. అప్పుడు సీతారామయ్య వైద్య విద్య ప్రారంభ సంవత్సరంలో ఉన్నారు. ఆయన సోదరుడు చంద్రశేఖర్ 9వ తరగతి చదువుతున్నారు. కారణాలు ఏమైనా డాక్టర్ సీతారామయ్య వైద్యవిద్యను పూర్తి చేసుకొని వచ్చే సరికి వెంకటరమణారావు వైద్యశాల నిర్వహణ కష్టంగా ఉంది. అప్పటికే రూపాయి డాక్టర్‌గా పేరున్న రమణారావు ఆ విషయంలో రాజీపడకపోవడం, తెలిసిన వారికి ఉచిత వైద్యం అందించడంలో వెనకడుగు వేయకపోవడంతో ఆ పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను డాక్టర్ సీతారామయ్య చేపట్టారు.



గత కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సీతారామయ్య

పేదల వైద్యం కోసం పెద్ద మనసు

- రిమ్స్ అభివృద్ధి సొసైటీ చైర్మన్‌గా ఎనలేని సేవలు

రాష్ట్ర విభజన అనంతరం 2014 సాధారణ ఎన్నికల్లో నవ్యాంధ్రలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడటంతోపాటు స్థానికంగా దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటికే దామచర్లతో సీతారామయ్యకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. సీతారామయ్య సేవాగుణం పట్ల జనార్దన్ కూడా ఆకర్షితులయ్యారు. తదనుగుణంగా ఆయనను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆయన వృత్తికి సంబంధం ఉన్న ప్రభుత్వ వైద్యశాల (రిమ్స్) అభివృద్ధి సొసైటీ వర్కింగ్ చైర్మన్‌గా సీతారామయ్యను నియమించారు. చేతిలో సొంత హాస్పిటల్ ఉన్నా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి, అక్కడి పేద రోగులకు సరైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న జనార్దన్ సహకారంతో అప్పట్లో వైద్యశాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాసరావును కలిసి వైద్యశాల అభివృద్ధికి తోడ్పాటు పొందగలిగారు. డెంగ్యూ వ్యాధి పెరిగిన సమయంలో ప్రభుత్వ వైద్యశాలలో ప్లేట్‌లెట్ విభాగాన్ని ఏర్పాటు చేయించుకోవడంలో విజయం సాధించారు. దాతల సహకారంతో ఇటు వైద్యశాలలో రోగులకు కావాల్సిన సౌకర్యాల కల్పనలోనూ, కొత్తగా ఏర్పడిన వైద్యకళాశాలలో విద్యార్థులకు వసతుల ఏర్పాటులో పురోగతిని సాధించి అందరి మన్ననలు పొందారు. హాస్పిటల్ ఆవరణలో మొక్కలు నాటించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. రోగులు ఖరీదైన మందుల కోసం బయట మెడికల్ షాపులకు వెళ్లకుండా ఆసుపత్రి ఆవరణలోనే జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేయడంలో తనవంతు కృషిచేశారు. ఆసుపత్రిలో నీటి సమస్యను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సొంత నిధులతో ఆసుపత్రి ఆవరణలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆ సేవలను గుర్తించి అప్పట్లో కలెక్టర్‌గా ఉన్న సుజాతశర్మ సీతారామయ్యకు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని ఇచ్చి అభినందించారు. అలా ముందుకు సాగుతూ అటు వైద్య వృత్తితో పాటు ఇటు రాజకీయంగానూ గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రత్యేకించి దామచర్ల జనార్దన్‌కు నమ్మినబంటుగా నిలబడ్డారు. అదే సమయంలో జిల్లాస్థాయిలో తెలుగుదేశం నాయకులతోనూ,స్థానికంగా కార్యకర్తలతోనూ సన్నిహిత సంబంధాలను మెరుగుపరుచుకున్నారు. ఇవన్నీ గుర్తించిన దామచర్ల జనార్దన్ పార్టీలోని ప్రజాప్రతినిధులు, నాయకుల మద్దతు కూడగట్టి సీతారామయ్యను పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా నియమించేందుకు దోహదపడ్డారు.



తెలుగుదండు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి పేదలకు దామచర్ల చేతుల మీదుగా మందులను పంపిణీ చేయిస్తున్న డాక్టర్ కామేపల్లి

తెలుగుదండు ప్రారంభం

రాజకీయాల్లో ముందడుగు వేస్తూ భవిష్యత్ ఎన్నికల్లో తెలుగుదేశం విజయానికి తోడ్పడాలని భావించిన సీతారామయ్య వైద్య వృత్తిలో ఉన్న కొందరు మిత్రులతో కలిసి తెలుగు దండు సోషల్ సర్వీస్ సొసైటీని ప్రారంభించారు. దీనిద్వారా ఏడాదిన్నరపాటు ఒంగోలులో విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఒంగోలుతోపాటు నగరంలోని అన్ని డివిజన్లలోనూ, సమీప గ్రామాల్లోనూ సేవా కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా ఉచితవైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. వైద్యశిబిరాలు నిర్వహించడం, పరీక్షలు చేయడం, అవసరమైన మందులను ఉచితంగా ఇవ్వడం చేశారు. అలాగే తమ పరిధిలో చేయగలిగిన శస్త్ర చికిత్సలను కూడా పేద రోగులకు ఉచితంగానే చేశారు. తనతోపాటు తన వైద్య మిత్ర బృందం సహకారంతో ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. తెలుగుదండు కార్యక్రమాలు 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దామచర్ల జనార్దన్ విజయానికి దోహదపడ్డాయంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య బాధ్యతల స్వీకరణ సందర్భంగా ప్రత్యేక సంచిక

రాజకీయ అడుగులు

వైద్యుడిగా సీతారామయ్య నిలదొక్కుకోవడం, వైద్యశాలకు పూర్వ వైభవం రావడం, డాక్టర్ చంద్రశేఖర్ పూర్తిగా వైద్యశాలకే పరిమితమైన దశలో డాక్టర్ సీతారామయ్య రాజకీయాల వైపు అడుగులు వేయడం ప్రారంభించారు. తొలి నుంచి తన తండ్రి వద్దకు వచ్చే ప్రముఖ నాయకులను, కార్యకర్తలను చూస్తూ ఓనమాలు నేర్చుకున్నారు. అప్పట్లో మాజీ మంత్రులు దామచర్ల ఆంజనేయులు, కాటూరి నారాయణస్వామి, మాజీ ఎంపీ కరణం బలరాం వంటి రాజకీయ నాయకులు, ప్రముఖులు తన తండ్రి వెంకటరమణారావును కలుస్తుండటం, వైద్య పరీక్షలకు రావడం జరుగుతుండేది. ఇక స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు, తెలుగుదేశం కార్యకర్తలు కూడా ఆయన వద్దకు వస్తుండేవారు. వారందరి రాజకీయ శైలికి తోడు తన తండ్రి వెంకట రమణారావు రాజకీయాల్లో సాధించలేకపోయిన పట్టును ఎప్పుడూ మననం చేసుకొనేవారు. అప్పటికే టీడీపీ పట్ల అభిమానంతో ఉన్న సీతారామయ్య రాజకీయంగా ఆపార్టీతోనే సాగాలని నిర్ణయించుకున్నారు. 2012 ఉప ఎన్నికల నాటికి ఆయనలో రాజకీయ ఆలోచన పెరిగింది. టీడీపీ ఒంగోలు ఇన్‌చార్జిగా దామచర్ల జనార్దన్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మద్దతుగా సీతారామయ్య రాజకీయ ఆరంగ్రేటం చేశారు. 2012 ఉప ఎన్నికల్లో దామచర్ల జనార్దన్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆయన గెలుపు కోసం ప్రత్యక్షంగా పనిచేశారు. ఇటు వైద్య వృత్తికి ఇబ్బంది రాకుండా రాజకీయంగా అడుగులు వేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులతో సీతారామయ్య(ఫైల్)



ఆరేళ్ల కష్టం.. ఆసుపత్రికి పూర్వవైభవం

తొలుత డాక్టర్‌గా నిలదొక్కుకునేందుకు సీతారామయ్య ప్రాధాన్యం ఇచ్చారు. 1999 ఆగస్టులో ఆయన ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభించారు. వైద్య వృత్తినే దైవంగా భావించి ఐదేళ్లు కష్టపడి గుర్తింపు పొందారు. రోగుల సంఖ్యను పెంచుకోగలిగారు. ఆపై తండ్రి నిర్వహించే ఆసుపత్రిపై దృష్టి సారించారు. తన క్లినిక్‌ను రమణారావు వైద్యశాలలోకి మార్చారు. తనకు చేదోడుగా ఉన్న సతీమణితోపాటు సోదరుడు చంద్రశేఖర్ సతీమణి కూడా వైద్యులే కావడంతో ముగ్గురూ సొంత వైద్యశాలలో సేవలు ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాదికే 2005 ప్రాంతం లో సోదరుడు చంద్రశేఖర్ న్యూరో సర్జన్‌లో స్పెషలైజేషన్ పూర్తి చేసుకున్నారు. చంద్రశేఖర్ కూడా వచ్చి వైద్యశాలలో చేరారు. ఆనలుగురు సేవలను అందిస్తూ వైద్యశాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేశారు. ఆరేడేళ్ల పాటు సీతారామయ్యకు తోడుగా సోదరుడు చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు నిలవడంతో వైద్యశాల పూర్వ వైభవం దిశగా అడుగులు వేసింది. కాలానుగుణంగా వైద్య రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఆసుపత్రిలో వసతులను మెరుగుపర్చుకొని క్రమేపీ అన్ని విభాగాల డాక్టర్లను చేర్చుకొని వెంకటరమణ నర్సింగ్‌హోంను మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దారు.

ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేటి రోజుల్లో డాక్టర్ సీతారామయ్య కుటుంబం ఉమ్మడిగా ఉండటం విశేషం. తాతలు, ఆపై తండ్రులు, ప్రస్తుతం కామేపల్లి సీతారామయ్య సోదరి, సోదరులు ఉమ్మడి కుటుంబాల అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఒంగోలుకు సమీపంలో ప్రస్తుత నాగులుప్పలపాడు మండలంలోని హనుమాపురం అనే కుగ్రామం ఉంది. ఆ గ్రామంలో వంద ఎకరాల పైబడి భూమి ఉన్న రైతు కుటుంబం సీతారామయ్య పూర్వీకులది. డాక్టర్ సీతారామయ్యకు ముగ్గురు తాతలు. ఆ ముగ్గురు జీవించినంత కాలం ఉమ్మడి కుటుంబంగానే కొనసాగారు. డాక్టర్ సీతారామయ్య తండ్రి రమణారావుకు ముగ్గురు సోదరులు.



తండ్రి రమణారావు, తల్లి భారతమ్మతో డాక్టర్లు సీతారామయ్య, చంద్రశేఖర్, వారి కుటుంబ సభ్యులు

ఉమ్మడి కుటుంబం కామేపల్లి సోదరుల సొంతం

వారిలో ఒకరు చిన్నతనం నుంచే మానసిక పరమైన ఆరోగ్య సమస్యలతో తక్కువ వయస్సులోనే మృత్యువాతపడ్డారు. మిగిలిన వారిలో డాక్టర్ రమణారావు పెద్దవారు కాగా, ఆయన సోదరుడు కృష్ణారావు మరో సోదరుడు రామస్వామి. ఆ ముగ్గురు ఉమ్మడి కుటుంబాన్ని కొనసాగించారు. స్వగ్రామంలో ఉన్న వంద ఎకరాల భూమి 125 ఎకరాలకు చేరింది. పొగాకు బ్యారన్‌లు

మిగతా 2వ పేజీలో..



అన్నీ స్టడీ చేస్తా.. సక్సెస్ అవుతా..

'డాక్టర్ వృత్తిలో ఉన్నా నేను రైతు కుటుంబం నుంచి వచ్చా. వారి సమస్యలు నాకు తెలియనవి కావు. అయినా మరింతగా తెలుసుకుని నాపై ఉంచిన నమ్మకం వమ్ముకాకుండా సెంట్రల్ బ్యాంక్ పాలనలో విజయవంతంగా ముందడుగు వేస్తా' అని ఆ బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ కామేపల్లి సీతారామయ్య స్పష్టం చేశారు. ఇటీవల చైర్మన్‌గా నియమితులైన ఆయన సోమవారం నుంచి విధులను ప్రారంభించబోతున్నారు. ఆ సందర్భంగా ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు



- పక్షపాతాలు, కక్షసాధింపులు ఉండవు
- రైతుల సేవతోపాటు ఉద్యోగుల సంక్షేమానికీ ప్రాధాన్యం
- డిపాజిట్లు సమీకరిస్తా.. సమన్వయంతో ముందడుగు వేస్తా..
- 'ఆంధ్రజ్యోతి' తో డాక్టర్ సీతారామయ్య

రైతులకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు డాక్టర్ సీతారామయ్య చెప్పారు. తాను రైతు కుటుంబంలోనే పుట్టానన్నారు. ఇప్పటికీ తనకు పొలాలు, పొగాకు బ్యారన్లు ఉన్నాయని తెలిపారు. రైతులతో అనునిత్యం సంబంధాలు కలిగి ఉన్నానని, వారి సమస్యలు తనకు తెలియనవికావన్నారు. అయితే సెంట్రల్ బ్యాంక్ పరంగా రైతులకు ఎలా ఉపయోగపడవచ్చు.. అందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం రాబట్టాలి అన్న విషయాలపై ముందుగా స్టడీ చేస్తానని చెప్పారు. జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతంలో కీలకమైన సొసైటీలను పటిష్టం చేయడమే తన లక్ష్యమన్నారు. పంట రుణాలతోపాటు రైతులకు ఎరువులు, పురుగు మందుల సరఫరా, గిట్టుబాటు ధరల కల్పనలో బ్యాంక్ ద్వారా ఉపయోగపడేందుకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సొసైటీల్లో సభ్యులైన రైతులకు చేయూతనివ్వడంలో పక్షపాతంకానీ, కక్షసాధింపు ధోరణికానీ ఉండదని స్పష్టం చేశారు. రైతులలో కూటమి ప్రభుత్వం పట్ల సానుకూలతను పెంచేవిధంగా ముందుకు సాగుతానని చెప్పారు. అధికారులు, ఉద్యోగుల సమర్థతకు అనుగుణంగా ఆయా విభాగాల్లో వారి సేవలను వినియోగించుకుంటాను తప్ప తరతమ భేదాలతో సమర్థులను పక్కనబెట్టబోనని హామీ ఇచ్చారు. బ్యాంక్‌లో గానీ, సొసైటీల్లోగానీ అవినీతి వ్యవహారాలకు తావు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అవినీతికి పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌తో ఎక్కువ సాన్నిహిత్యం ఉన్నప్పటికీ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతోకూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. కిందిస్థాయిలో సమస్యలు ఎదురైతే ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నేతలు, సింగిల్ విండో పాలక మండలి బాధ్యులను కలుపుకొని ముందడుగు వేసి పరిష్కరిస్తానని చెప్పారు. డాక్టర్ వృత్తిని కొనసాగిస్తున్నా అవసరమైన సమయాన్ని చైర్మన్ బాధ్యతల నిర్వహణకు కేటాయిస్తానని చెప్పారు. అవసరమైనప్పుడు ఆస్పత్రిలో ఓపీ చూడడమైనా ఆపుతానే తప్ప బ్యాంక్ బాధ్యతలకు లోటు రానివ్వబోనన్నారు. బ్యాంక్ పరిధిలోని సొసైటీలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ, కూటమిలోని ఇతర పార్టీల అభ్యర్థులకు విజయం చేకూరే విధంగా రాజకీయంగ అడుగులు వేస్తానని సీతారామయ్య చెప్పారు. సింగిల్ విండో చైర్మన్‌లకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. తనను డాక్టర్‌గా చూసేవారికి మాది ఇప్పటికీ 125 ఎకరాల పొలం ఉన్న కుటుంబం అని తెలియజేస్తున్నానన్నారు. మాకు ఇప్పటికీ హనుమాపురంలో పొగాకు బ్యారన్‌లు ఉన్నాయని చెప్పారు.

ఉమ్మడి కుటుంబం కామేపల్లి సోదరుల సొంతం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. డాక్టర్ రమణారావుతోపాటు కృష్ణారావు వైద్యవిద్యాభ్యాసం చేసి వైద్యులు అయ్యారు. ఆ ఇద్దరు ఉమ్మడిగానే వైద్యశాలను నిర్వహించారు. వారికి సోదరుడైన రామస్వామి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నా ఉమ్మడి కుటుంబంగానే ఉన్నారు. స్వగ్రామంలోని ఆస్తులను పంచుకోలేదు. వీరిలో రమణారావుకు ఇద్దరు కుమారులు కాగా, కృష్ణారావుకు ఇద్దరు కుమార్తెలు. రామస్వామికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. ముగ్గురు పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుకున్నారు. కానీ ఉమ్మడి ఆస్తిని ఉమ్మడిగానే అనుభవిస్తూ అందరూ కలిసే కొనసాగారు. రమణారావుకు ఇద్దరు కుమారుల్లో పెద్దవారు సీతారామయ్య కాగా, చిన్నవారు డాక్టర్ చంద్రశేఖర్. కృష్ణారావు కుమార్తెలు వివాహం చేసుకొని ఒకరు దర్శిలో, మరొకరు హైదరాబాద్‌లో ఉన్నారు. రామస్వామి ఇద్దరు పిల్లలు వారి వారి వృత్తుల్లో స్థిరపడ్డారు. రమణారావు ముగ్గురు సోదరులకు ఆరుగురు పిల్లలు కాగా ఆరుగురు వేర్వేరు వృత్తుల్లో ఉన్నా ఉమ్మడి ఆస్తిని అలాగే ఉంచుకొని కలిసి మెలిసి కొనసాగుతున్నారు. ఈ ఆరుగురి పిల్లలు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడటంతో స్వగ్రామంలోని 125 ఎకరాల భూమిని, అలాగే బ్యారన్‌లను కౌలుకు ఇచ్చారు. ఆ మొత్తంలో వచ్చే ఆదాయాన్ని ఆరుగురు సమానంగా పంచుకుంటున్నారే తప్ప ఆస్తులు విడగొట్టుకొని ఎవరికి వారు సొంతం చేసుకోలేదు. ఆయా సందర్భాలలో వారందరూ హనుమాపురంలోని ఇంట్లో కలుస్తుండటం కూడా విశేషం. ఇక రమణారావు పిల్లలైన డాక్టర్ సీతారామయ్య, చంద్రశేఖర్‌ల విషయానికి వస్తే ఇద్దరూ ఇప్పటికీ ఉమ్మడిగానే వెంకటరమణ నర్సింగ్ హోంను నిర్వహిస్తున్నారు. వీరిద్దరిలో డాక్టర్ సీతారామయ్య బంధువైన ఆమెను వివాహం చేసుకోగా, డాక్టర్ చంద్రశేఖర్ తనతో డాక్టర్ విద్యను అభ్యసించిన ఏలూరు వాసిని వివాహం చేసుకున్నారు. అందరూ కలిసే వైద్యశాలను నిర్వహిస్తుండటం విశేషం. డాక్టర్ రమణారావు, ఆయనసతీమణి ఇందిరాదేవి జీవించి ఉన్నంతకాలం మూడు కుటుంబాల వారు వైద్యశాలలోనే నివాసం ఉండేవారు. తల్లిదండ్రులకు చేదోడుగా డాక్టర్లు ఇద్దరూ కుటుంబాలతో కలిసి వైద్యశాలలోనే నివాసం ఉన్నారు. ఈ ఇద్దరు డాక్టర్లకు చెరొక కుమార్తెలు కూడా ఉన్నారు. సీతారామయ్య కుమార్తె ప్రస్తుతం వైద్యవిద్యాభ్యాస్యం చేస్తుండగా, చంద్రశేఖర్ కుమార్తె ఈ ఏడాది వైద్యవిద్యలో చేరబోతోంది. గత కరోనా సమయంలో కొద్దినెలల వ్యవధిలోనే తల్లిదండ్రులిద్దరినీ సీతారామయ్య, చంద్రశేఖర్ కోల్పోయారు. అయినా ఉమ్మడి కుటుంబ విధానాన్ని వారు వదల లేదు. వైద్యశాలల అభివృద్ధి చెందడం, ఇతరత్రా కుటుంబాల వారి ఆదాయ వనరులు పెరిగినా ఉమ్మడి ఆస్తిని అలాగే ఉంచి కలిసి మెలిసి వైద్యశాలను నిర్వహిస్తూ ఉమ్మడి కుటుంబాన్ని కొనసాగిస్తున్న తీరు అభినందనీయం.




పదవీ బాధ్యతల స్వీకారోత్సవ శుభాకాంక్షలు
డా॥ కామేపల్లి సీతారామయ్య గారు
MBBS, F.Diab, C.C.Diab
షుగర్ & థైరాయిడ్ నిపుణులు
ఛైర్మన్: ది ప్రకాశం జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్
డా॥ కామేపల్లి చంద్రశేఖర్ గారు
M.S(Gen), M.Ch, Neuro Surgery
Specialist in Brain & Spine Surgery
ది ప్రకాశం జిల్లా కో - ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న
డా॥ కామేపల్లి సీతారామయ్య గారికి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేస్తూ...
వెంకటరమణ నర్సింగ్ హోమ్
డాక్టర్స్ మరియు అన్ని విభాగాలు & స్టాఫ్
SINCE 1969
కర్నూల్ రోడ్, ఒంగోలు

పదవీ బాధ్యతల స్వీకారోత్సవ శుభాకాంక్షలు





డా॥ కామేపల్లి సీతారామయ్య గారు
MBBS, F.Diab, C.C.Diab
షుగర్ & థైరాయిడ్ నిపుణులు
చైర్మన్: ది ప్రకాశం జిల్లా కో-ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్

శ్రీ నారా లోకేష్‌బాబు గారు
మానవ వనరుల అభివృద్ధి,
ఐటి, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్,
రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖామాత్యులు

డా॥ కామేపల్లి చంద్రశేఖర్ గారు
M.S(Gen), M.Ch, Neuro Surgery
Specialist in Brain & Spine Surgery

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు గారు పేద ప్రజలకు అందిస్తున్న సేవలను, వారి ఆశయాలను, విలువలను చూసి స్వర్గీయ డా॥ కామేపల్లి వెంకటరమణారావు, స్వర్గీయ డా॥ కామేపల్లి వెంకట కృష్ణారావు గార్లు 'అన్న' గారి వెంట నిలిచి ప్రకాశం జిల్లా ప్రజలకు వైద్య, విద్యారంగాలలో ఎన్నో సేవలందించారు. వారిస్ఫూర్తితో డా॥ కామేపల్లి సీతారామయ్య గారు, డా॥ కామేపల్లి చంద్రశేఖర్ గార్లు తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ ప్రకాశం జిల్లా ప్రజలకు సేవా కార్యక్రమాలను చేస్తూ "తెలుగు దండు" అనే ఒక వ్యవస్థను స్థాపించి గత 10 సం॥లుగా ఎన్నో ఉచిత వైద్య శిబిరాలను పెట్టి ప్రజలకు సేవలందించి, ఎంతో మంది పేద విద్యార్థులకు చేయుతనందించిన దార్శనికులు, వారి సేవలను గుర్తించిన తెలుగుదేశం పార్టీ డా॥ కామేపల్లి సీతారామయ్య గారిని ది ప్రకాశం జిల్లా కో - ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవితో గౌరవించింది.

నేడు ది ప్రకాశం జిల్లా కో - ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న శుభతరుణంలో
డా॥ **కామేపల్లి సీతారామయ్య** గారికి మా హార్థిక శుభాకాంక్షలు



కొప్పోలు బాలాజీరావు
Rtd. Manager, PDCC Bank, Chimakurthy

కొప్పోలు వీరయ్య
మాజీ సర్పంచ్, హెచ్.నిడమానూరు

సంతనూతలపాడు, నాగులుప్పలపాడు(మం), హనుమాపురం, బి.నిడమానూరు & కావూరివారిపాలెం
గ్రామ పంచాయతీలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు కార్యకర్తలు

వైభవంగా కల్యాణోత్సవం

గిద్దలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగవతి భగవాన్ ధ్యాన మందిరం ఆవరణలో ఆదివారం పరం జ్యోతి భగవతి భగవాన్ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించినట్లు భగవతి భగవాన్ సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాదుకా దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి వార్షికోత్సవ పూజలు

గిద్దలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో తృతీయ వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా బండలాగుడు పోటీలను ఏర్పాటు చేసి సుమారు లక్ష రూపాయల నగదు బహుమతులను నిర్వాహకులు అందచేశారు.

వృథాగా రక్షిత నీటి పథకాలు

- లక్షల్లో ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- తాగు నీటి సమస్య తీవ్రం
- కన్నెత్తి చూడని అధికారులు

పొదిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నీటి ఇక్కట్లు తీర్చేందుకు లక్షలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలు ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పొదిలి మండలంలోని అత్యధిక గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. అయినా అధికారులు అటు వైపు దృష్టిపెట్టడం లేదు. వేసవి కాలంలో రెండు నెలలు మాత్రం గ్రామాల్లో నీటి సమస్యపై దృష్టి సారించామని ప్రజా ప్రతినిధుల సమావేశాల్లో చెప్పడం మినహా నీటి సమస్యకు ముందస్తు ప్రణాళికలు వేసిన దాఖలాలు లేవు. మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో నీటి సరఫరా చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించారు. కొంతకాలం నీటి సరఫరా బాగానే జరిగింది. ఆ తరువాత పైలెట్ ప్రాజెక్ట్ కింద కొన్ని గ్రామాల్లో బోర్లు వేసి నీటి సరఫరా చేశారు. వర్షాభావం కారణంగా బోర్లలో నీరు తగ్గిపోవడంతో అవి మరుగున పడిపోయాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ నీరు చేరకపోవడంతో ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. తలమళ్ల, అన్నవరం, రాములవీడు, రామాపురం, గురుగుపాడు, సూదనగుంట, ఈగలపాడు, ఉప్పలపాడు, గోగినేనివారిపాలెం, గ్రామాల్లో అప్పటి లెక్కల ప్రకారం సుమారు రూ.కోటి వెచ్చించి నీటి సరఫరా పథకాలు నిర్మించారు. బోర్లకు మోటార్లు ఏర్పాటు చేసి నాణ్యత గల పైపులు వేసి ట్యాంకులను ఉపయోగించవచ్చు. కానీ అలా చర్యలు తీసుకోకుండా ఓవర్‌హెడ్ ట్యాంకులను గాలికి వదిలేశారు. అయితే కొన్ని గ్రామాలకు నాణ్యతలేని పైపులపులు వేయడంతో అవి పగిలిపోయి నీటి సరఫరా అసలు జరగలేదు. దీంతో రూ.కోట్ల నిధులు మట్టిలో పోసినట్లయింది. గురుగపాడు గ్రామంలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్నా చేతి పంపులనే స్థానికులు వినియోగిస్తున్నారు. తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా ఎక్కువగా ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. అవికూడా అంతంతమాత్రంగానే సరఫరా జరుగుతుందని ఆయా ప్రాంతాల వాసులు చెప్తున్నారు. ట్యాంకర్ల నీరు శాశ్వతం కాదని, గ్రామాల్లో నిర్మించిన రక్షిత నీటి పథకాలు, బోర్లు శాశ్వ తమని, ఈ ప్రభుత్వమైనా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అక్కచెరువులో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



బోయలపల్లి వద్ద చప్టా కింద పారుతున్న నీరు

మృగశిర వచ్చే.. వాన కురిసే

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె ఆదివారం ప్రారంభం కావడంతో మండలంలోని బోయలపల్లి, గంగపాలెం, అమానిగుడిపాడు, నర్సాయపాలెం గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులు పంట పొలాలను దుక్కి దున్ని సాగుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కంది, ఆముదం, పత్తి సాగు చేసేందుకు అదునుగా ఉంటుందని రైతులు తెలిపారు.

చిత్తడిగా మారిన వీధులు



16వ వార్డులో నిలిచి ఉన్న వాన నీరు

ఎర్రగొండపాలెం : మేజర్ పంచాయతీలో ఆదివారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షంతో సేద తీరారు. అయితే వర్షం పడిన ప్రతిసారీ వీధులు చిత్తడిగా మారుతున్నాయి. ఆదివారం కురిసన వానతో వీధులు జలమయమయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా సైడు కాలువలు నిర్మించకపోవడంతో వాన నీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. కొన్నిచోట్ల కాలువలను పూడ్చి మెట్లు కట్టడంతో రోడ్లపై వాన నీరు నిలిచి ఉంటోంది. పాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, మసీద్, ఒంగోలువారి వీధుల్లో రోడ్లపై వాన నీరు పారింది.

గురుకులంలో ప్రవేశానికి సీట్లు ఖరారు చేసుకోవాలి

కంభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కంభం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5, ఇంటర్ ప్రవేశాలకు ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ చాముండేశ్వరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ర్యాంకు పొందిన వారి ఎంపిక ఇప్పటికే పూర్తైనట్లు, విద్యార్థుల మొబైల్‌కు మెసేజ్ వచ్చిన వెంటనే ఆయా పాఠశాల, కళాశాలలకు వెళ్లి తమ సీట్లను ఖరారు చేసుకోవాలన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

మహిళల సమున్నత అభివృద్ధే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యే కందుల

పొదిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల సమున్నత అభివృద్ధే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంతో పాటు, మండలం, కొనకనమిట్ల మండలాల వెలుగు సిబ్బంది, వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో దాదాపు రూ.2వేల800 గ్రూపులు ఉన్నాయని, ఈగ్రూపుల్లో వారికి రూ.50కోట్ల వరకు ప్రభుత్వం రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈరుణాలతో వెలుగు సిబ్బంది, వీవోఏలు, గ్రామ పార్టీ నాయకులు సమిష్టిగా కృషి చేసి డ్వాక్రా గ్రూపులను అభివృద్ధి చేయాలన్నారు. కొనకనమిట్ల మండలంలో 3వేల ఎకరాల్లో రూ.1500కోట్లతో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఏటా రైతులకు ఎకరాకు రూ.30వేల రూపాయలు, అసైన్‌మెంట్ భూములకు ఎకరాకు రూ.15వేల వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇటువంటి ఇండస్ట్రీని మండలంలో ఏర్పాటు చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కందులను వెలుగు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వీవోఏలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

అమరావతి మహిళలను అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

కంభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్‌లో జరిగిన డిబేట్‌లో అమరావతి మహిళలను అవమానకరంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం కంభం, అర్ధవీడు మండలాల తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లు పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ నారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ జర్నలిస్టు కృష్ణంరాజుపై, డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసులు, సాక్షి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి, జడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా అంగీకరించని జగన్‌రెడ్డి తన సాక్షి చానల్‌లో ద్వారా మహిళలను కించపర్చేలా మాట్లాడించినందుకు ఆయన బేషరతుగా మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ మహిళా నాయకురాలు ఆరేపల్లి సుభాషిణి, గొట్టిముక్కల మహాలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ చింతలబోయిన విజయలక్ష్మి, అర్ధవీడు తెలుగు మహిళా నాయకురాలు కత్తి భారతి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పొదిలి : అమరావతి మహిళా రైతులను కించపరిచేలా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం మార్కాపురం నియోజకవర్గ తెలుగు మహిళలు పొదిలి పట్టణం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కంభం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

మార్కాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామ శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన చిల్ల చెట్లను తొలగింపు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొంత కాలంగా శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు పెరగడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించి శ్మశాన అభివృద్ధికి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎక్స్‌కవేటర్‌తో శ్మశాన స్థలాన్ని చదునుచేయించి చుట్టూ బార్డర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నీటి వసతితో పాటు అంతర్‌దారిని కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీలర్ గంగిరెడ్డి రామక్రిష్టారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కనక శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గూడా రమణారెడ్డి, చైతన్యరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

మత్తులో యువత చిత్తు!

- బైక్ రేస్‌లు.. కేరింతలు
- ఒకరిపై ఒకరు దాడులు
- భయపడుతున్న స్థానికులు
- పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మంచి అలవాట్లతో, ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు, ఊరికి పేరు తెచ్చేలా ఉండాల్సిన యువత పెడదారి పడుతోంది. మత్తుకు బానిసలై నిండైన జీవితాన్ని చిత్తు చేసుకుంటోంది. మత్తుకు బానిసలై ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్న ఘటనలు పట్టణ ప్రాంతాల్లో చోటుచేసుకుంటుండగా అది గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది.

ఎర్రగొండపాలెం పట్టణంలో ఈ నెల 2వ తేదీన 565 జాతీయ రహదారి 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా సుమారు 30 మంది యువకులు మద్యం మత్తులో ఊగుతూ రోడ్లపైకి వచ్చి మరి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని గాయపర్చుకున్నారు. ఇది చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు. వెంటనే హుటాహుటీన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఆ యువకులు నాలుగు దిక్కులా పారిపోయారు. వాళ్లు ఎందుకు కొంట్టుకున్నారో తెలియదు.

ఆదే తరహాలో సోమవారం రాత్రి 10 గంటల నుంచి 11 గంటల ప్రాంతంలో 20 నుంచి 30 మంది యువకులు సమీపాన ఉన్న మైదాన ప్రాంతంలో తాగిన మత్తులో గోలచేసినట్లు స్థానికులు తెలిపారు. గతంలో మాదిరి ఒకరిపై ఒకరు చొక్కాలు చించుకొని దాడులు చేసుకుంటూ కేకలు వేశారని వారు చెప్తున్నారు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు అదే మాదిరి యువకులు దాడులు చేసుకుంటున్నా స్థానికుల ఫిర్యాదు చేసిన పోలీస్ శాఖ నిఘా వేయడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వైపాలెంలో జాతీయ రహదారిపై ఘర్షణపడుతున్న యువత (ఫైల్)

8 దాటితే బైక్‌లపై రేస్‌లు

పట్టణంలో జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో యువత బైక్ రేస్‌లు ఎక్కువయ్యాయని పలువురు చెప్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాళాశాల నుంచి కొత్తపల్లి వరకు రాత్రి 8 గంటల తర్వాత బైక్ రేసింగ్‌లతో యువత హల్ చల్ చేస్తున్నారు. బైక్‌లకు ఉన్న సైలెన్సర్ తీసివేసి మరి భయంకరమైన శబ్దాలతో రేసింగ్ చేస్తున్నారని ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.



రాత్రి సమయంలో యువకుల బైక్ రేస్‌లు

తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలి

తమ పిల్లలు ఏమి చేస్తున్నారో.. ఎటు వెళ్తున్నారో.. అన్నదానిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పలువురు అంటున్నారు. రాత్రి వేళల్లో ఏక్కడికి వెళ్తున్నారు.. ఏమి చేస్తున్నారు.. వ్యసనాలకు అలవాటు పడుతున్నారా అన్నదానిని ఎప్పడికప్పుడు గమనించి వారిని దారిలో పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అంటున్నారు.

నిఘా అవసరం

పట్టణంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ అధికారులు నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ పీ చౌడయ్య వివరణిస్తూ గొడవలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. రాత్రి వేళల్లో నిఘా ఉంది. రోడ్లపై ఆర్భాటాలు, గోలగోల చేసేవారి యువకుల వివరాలను సేకరిస్తున్నాం.



పైపు పగిలి వృథాగా పోతున్న నీరు

నీరు వృథా...అధికారులకు పట్టని వ్యథ

తర్లుపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా అయ్యే పైపులు 15 రోజుల కిందట పగిలి నీరు లీకై వృథాగా పోతున్నాయి. అయినా సంబంధిత అధికారులు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లీకేజీతో ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా కాకా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి సచివాలయం సమీపంలో ఈ పైప్‌లైన్ పగిలి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబవరం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో, అలాగే విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అంబవరం, రూరల్ ఫీడర్లు పాములపల్లి, కొండపేట, ఉప్పలపాడు గ్రామాలలో ఇళ్లకు, వ్యవసాయానికి ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, ప్రజలు గమనించాలని కోరారు.

అనాథలకు నిత్యావసరాల పంపిణీ

కంభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మండలం పెద్దనల్లకాలువ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈపాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో 10మంది తల్లిదండ్రులు లేని అనాథలు కాగా, మరో 30 మంది తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు ఉండడం విచారకరమన్నారు. తమ ట్రస్టు దృష్టికి రాగానే సహాయం చేయాలని కందిపప్పు, నూనె, గోధుమపిండి, రవ్వలు, తదితర సరుకులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ఆరవీటి వెంకటరమేష్ మనవరాలు సావిత్రి పుట్టినరోజు సందర్భంగా అనాథలకు ప్లేట్లు, గ్లాసులు, స్వీట్లు పంపిణీ చేశారు. బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన హెచ్ఎం పత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మంచి సేవా కార్యక్రమాలతో ఈపాఠశాలలో తన సర్వీసును ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సురేష్, ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రాక

రాచర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలో సోమవారం జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ, నూతనంగా నిర్మించిన సచివాలయ భవన ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొననున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కటికె యోగానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

రాచర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యడవల్లిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, గ్రామపెద్దలు భవనం పుల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు


మార్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు కల్పించని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ నెల 11న పొదిలికి వస్తున్న వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని రైతులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు మీర్జా షంషీర్ అలీబేగ్, జడ్పీటీసీ నారు బాపనరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కనకదుర్గ, చెంచిరెడ్డి, సలీమ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో జ్ఞానశ్రీ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానశ్రీ ఐఐటీ, నీట్ అకాడమి విద్యార్థులు పలువురు ఆదివారం విడుదలైన ఏపీఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకులతో ప్రతిభచాటినట్లు డైరెక్టర్ ఎమ్.మల్లికార్జునరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో బి.వెంకటసాయి రోహిత్‌రెడ్డి 2,463వ ర్యాంకు, బైసీపీ విభాగంలో షేక్ జుబేరియా 1,759వ ర్యాంకు, దూదేకుల షాబీర్‌బాషా 2,623వ ర్యాంకు, ఎస్.దయాన 4,450, ఎస్.అంజలి 6,303, వి.సుబ్రహ్మణ్యం 8,213, కె.అమూల్య 9,659, షేక్ మహమూద్ అసద్ 15,315, డి.మెహతాబ్ 15,534, జి.మాధురి 18,589వ ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకాడమీ యాజమాన్యం అభినందించింది.



వెంకటసాయి రోహిత్‌రెడ్డి



షేక్ జుబేరియా

వీర సైనికుల పేరుమీద మొక్కలు

కంభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా, ఆపరేషన్ సిందూర్‌లోవీరమణం పొందిన అమరవీరులు మురళీనాయక్ తదితరుల పేరుమీద మామిడి, ఉసిరి, నేరేడు మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడుదాం - భవిష్యత్తును రక్షిద్దాం, జూన్ 15వ తేదీ వరకు మొక్కలు నాటాలని బీజేపీ నాయకులు పల్లెం శ్రీనివాసులు తెలిపారు.

నిలిచిన తాగునీటి సరఫరా

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కొరవడిన ఇంజనీర్ల పర్యవేక్షణ

ఎర్రగొండపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు చుట్టూ 12 గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా చేసే వరల్డ్ బ్యాంక్ తాగునీటి పథకం మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. త్రిపురాంతకం మండలం నడిగడ్డ గ్రామం వద్ద వరల్డ్ బ్యాంక్ తాగునీటి పథకం నుంచి సాగర్ జలాలు సరఫరా ఆగినట్లు వర్కర్లు తెలిపారు. వారంరోజులుగా తీవ్రమైన ఎండలతో నీటి అవసరాలు పెరిగాయి. మరోపక్క నీటి సరఫరా బంద్‌తో బోయలపల్లి, నరసాయపాలెం, గంగాపాలెం, గోళ్లవీడపి, పందివానిపల్లె, వీరాయిపాలెం, వీరభద్రాపురం, ఎల్లారెడ్డిపల్లి, కొలుకుల గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటిని అందించాలని ప్రజలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరప్పాడు పరిధిలోగల గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మతల్లి భక్తుల కోర్కెలను తీర్చే తల్లిగా పూజిస్తూ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. భక్తుల రాకతో గుంటిగంగ ప్రాంతం తిరునాళ్ల వాతావరణం నెలకొంది. ఆలయ అర్చక పూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆర్.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ

ముండ్లమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లంపల్లిలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అంకమ్మ తల్లి నెలవారీ పొంగళ్ళు ఆదివారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా ఆలయాన్ని ప్రతిష్ఠించి నెల రోజులు కావటంతో గ్రామం అంతా ఇంటి వద్ద పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

నేడు పామూరులో ర్యాలీ

పామూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం మండలంలోని ప్రతి గ్రామ సచివాయం పరిధిలో మాస్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మాస్ ర్యాలీని విజయవంతం చేసేలా గ్రామస్థాయి అధికారులు కృషి చేయా లన్నారు.

ఈఏపీసెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఈఏపీసెట్‌లో ప్రతిభ కనపరిచారు. ఇంజనీరింగ్ విభాగంలో జొన్నలగడ్డ జ్యోతి 23027 ర్యాంకు, గోగు మహాలక్ష్మి 48198 ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీలో లక్కిపోగు అఖిల 23605 ర్యాంక్ సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బోడ ప్రసాద్, ఇరగని చలపతిరావు, మస్తానయ్య, తదితరులు అభినందించారు.

పామూరులో మోస్తరు వర్షం

పామూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో వాతావరణం కాస్తంత చల్లబడటంతో ఉపశమనం చెందారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదర, భీమవరం, పూరిమెట్ల, అగ్రహారం, తమ్మలూరు, పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, కెల్లంపల్లి బసవాపురంలో భారీ వర్షం కురిసింది. ముండ్లమూరు, సింగనపాలెం, శంకరాపురం, పోలవరం, సుంకరవారిపాలెంలలో మోస్తరు వర్షం పడింది.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దర్శిలో ఈ నెల 21,22, తేదిల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను, ఆగస్టు 23,24,25 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ మౌలాలి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నల్లమడుగుల గ్రామంలోని ఎస్టీ సంఘంలో మండల కార్యదర్శి పెద్ద మస్తాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రమ జీవులకు అండగా సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

అపరిశుభ్రంగా దర్శి

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దర్శి-కురిచేడు రోడ్డులో పేరుకుపోయిన చెత్త

దర్శి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాలు అధ్వానంగా మారాయి. చెత్తకుప్పలు సకాలంలో ఎత్తకపోవటంతో దుర్వాసన వెదజల్లుతుంది. పలుచోట్ల చెత్తకుప్పలు రోజుల తరబడి అలాగే ఉంచుతున్నారు. దీంతో దోమలు ఉత్పత్తి జరిగి ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. దర్శి మైనర్ కాలువలో చెత్త, వ్యర్థ పదార్థాలు తీసి నెలరోజుల క్రితం గట్టుమీద వేశారు. నెలరోజులు గడుస్తున్నా ఆ చెత్తను తొలగించలేదు. ఆప్రాంత ప్రజలు దుర్వాసన తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నా రు. ఇటీవల దర్శి నగర పంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రజలకు మెరుగైన సేవలందిస్తారని, పట్టణాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దుతారని భావిస్తున్న తరుణంలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అన్నీప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దర్శి మైనర్ కాలువపై పేరుకుపోయిన చెత్తాచెదారం

కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలో ఆదివారం జరిగిన పలు దైవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పెద్ద గోగులపల్లి గ్రామంలో శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం, నవగ్రహమూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాలు వేద మంత్రోచ్చరణ నడుమ వైభవంగా జరిగింది. కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అలాగే, మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో శ్రీభైరవేశ్వరస్వామి నిత్య అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే ఉగ్ర ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక హోమాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ఎన్‌సీ మాలకొండయ్య, మన్నెపల్లి శ్రీను, సర్పంచ్ శ్యామలమ్మ, దేవస్థాన చైర్మన్ శ్యాం సుందర్ రాజు, నరసరాజు, వెంకట్రామరాజు, రామకృష్ణంరాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు సహస్రనామ పూజలు, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మహా నైవేద్యాన్ని మేళతాళాలతో ప్రాంగణం చుట్టూ ప్రదిక్షణలు చేసి స్వామి వారికి సమర్పించారు. గోశాలలోని గోవులకు పసుపు కుంకుమలతో గో పూజలు నిర్వహించి హారతి ఇచ్చి నైవేద్యాన్ని పంచిపెట్టారు. దేవస్థా నం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదా న కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.



పామూరులో స్వామివారికి నిర్వహిస్తున్న గ్రామోత్సవం

పామూరులో స్వామివార్ల గ్రామోత్సవం

పామూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పామూరులోని శ్రీమదనవేణు గోపాలస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పొన్నమాను సేవా కార్యక్రమాలను ఉభయదాతలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదాతలైన పసుపులేటి బ్రదర్స్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు నారాయణం సత్యబాబు విశ్వక్షేణ పూజ, పుణ్యావాచనం, నిత్యహోమం, విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివార్లను పొన్నమాను సేవ నిర్వహిస్తూ పామూరు మాడవీధుల్లో తప్పెట్లు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కార్యక్రమంలో ఈవో నరసిం హబాబు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వార్లకు మహా నైవేద్యం తీసుకువస్తున్న భక్తులు

అధ్వానంగా రహదారులు

- అడుగడుగునా గోతులమయం
- వాహన చోదకుల అవస్థలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పెదఉల్లగల్లు నుంచి రాజగోపాలరెడ్డి నగర్, కమ్మవారిపాలెం వెళ్లే రహదారి అడుగడుగునా కోతులుపడ్డాయి. దీంతో వాహనచోదకులు వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు.

పెద ఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళటానికి ఆరు కిలో మీటర్లు ఉండగా దాదాపు మూడు కిలో మీటర్లకు పైగానే గోతులమయమయ్యాయి. ఈ రహదారి పంచాయతీరాజ్ పరిధిలో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టిపోసిన పాపాన పోలేదు. ఈ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు హడలి పోతున్నారు. ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.



గోతులమయమైన పెదఉల్లగల్లు - వేముల రహదారి



అధ్వానంగా రెడ్డినగర్ - బసవాపురం రోడ్డు

రాజగోపాలరెడ్డి నగర్ వద్ద తారంతా లేచి పోయి కంకర బయట పడింది. దానికితోడు చిల్లచెట్లు రహదారి మీదకు వచ్చాయి. కమ్మవారిపాలెం, వేముల, రమణారెడ్డిపాలెం, ఈదర, కొమ్మవరం, బొప్పూడివారిపాలెం గ్రామాల ప్రజలు నియోజక వర్గ కేంద్రమైన దర్శి వెళ్ళాలంటే ఈరహదారి పైనే ప్రయాణం సాగిస్తుంటారు.

ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న రహదారి అడుగడుగునా గోతులు పడ్డా కూడా కనీసం అధికారులు మరమ్మతులు చేయాలన్న ఆలోచన కూడా రాలేదు. అనేక సార్లు ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులకు తెలియజేసినా కూడా పట్టించు కోలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యతగా అనేక రహదారులు మరమ్మతులు చేశారు. ఈ రహదారి గురించి పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి రహదారికి మరమ్మ తులు చేసి ప్రయాణం సాఫీగా సాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అలాగే, మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని బసవాపురం నుంచి రెడ్డినగర్ వెళ్ళే పంచాయతీరాజ్ రహదారి అధ్వానస్థితికి చేరింది. గోతులమయం కావటంతో వాహన చోదకులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు కిలో మీటర్లు ఉండే ఈ రహదారి అడుగుకో గుంత ఏర్పడటం వల్ల వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులను కలసి విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో అతి ముఖ్యమైన రహదారులైన పెద ఉల్లగల్లు, వేముల, బసవాపురం, రెడ్డినగర్ మార్గాలను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భానుడు భగభగ

- ఉక్కపోతలు, కరెంట్ కోతతో సతమతమవుతున్న ప్రజలు

దొనకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవలకాలంలో విచిత్ర వాతావరణం నెలకొంది. ముందుగానే మే నెలలోనే రుతుపవనాలు పలుకరించాయి. ఆతర్వాత మళ్ళీ ఎండలు పెరిగాయి. పగటిపూట ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో పాటు రెండు మూడు రోజులుగా సాయంత్రం వేళల్లో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు కురుస్తూ విచిత్ర వాతావరణం నెలకొంటుంది. ఉదయం 9 గంటల నుంచే పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా ఉండ టంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం పూట ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

ఇటీవలకాలంలో ఉష్ణోగ్రతలు ఆపై కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 11 గంటలు దాటితే బయటకు రావాలంటేనే బెంబేలెత్తుతున్న ప్రజలు ఇంట్లోనే సేద తీరుదామన్న కరెంట్ కోతలతో నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కరెంట్ కోతలు ఇటీవల పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒబ్బాపురంలో ఒక ప్రాంతంలోనే తరచూ కరెంట్ గంటల తరబడి పోతుండటంతో సిబ్బందిని సంప్రదిస్తే ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు కాలిపోతున్నాయనే సమాధానం చెబుతున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మానుష్యంగా దొనకొండలోని రైల్వేస్టేషన్ రహదారి

మహిళలను కించపరిస్తే మూల్యం తప్పదు!



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కనిగిరి(వెలిగండ్ల), జూన్ 8(ఆంధ్రజ్యోతి): విశ్లేషణల పేరుతో మహిళలను కించపరిచేలా వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని తెలుగు మహిళలు హెచ్చరించారు. నీచపు వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం తెలుగు మహిళలు కనిగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగన్మోహన్‌రెడ్డికి తొలి నుంచి మహిళలంటే చిన్న చూపు అని పేర్కొన్నారు. కన్న తల్లిని, తోడబుట్టిన చెల్లిని గౌరవించని వ్యక్తి అని అన్నారు. వారి సంతోషాన్ని జీర్ణించుకోలేని ఆయన మహిళలను గౌరవిస్తారను కోవడం దురాశేనని అన్నారు. తన చేతిలో సొంత మీడియా చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రాజధాని మహిళలను కించపరిచిన వారిని, దాని సృష్టికర్త జగన్‌కు రాష్ట్ర మహిళలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర మహిళలకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు వాజీదాబేగం, అరుణ, దొరసాని, నారాయణమ్మ, తులసి, నీరజ, లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి, రమణమ్మ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దర్శి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 750 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు అందులో 420 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. తొలి విడతగా ఆదివారం 200 మందిని అక్కడకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. మిగిలిన వారికి వారం రోజుల్లో ఆపరేషన్లు నిర్వహించే ఏర్పాట్లు చేస్తామని రోటరీక్లబ్ సభ్యులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కేవీ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏ.నారాయణరెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, మారం శివకోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పెదకోటయ్య

ముండ్లమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉల్లగల్లు - వినుకొండ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పెదఉల్లగల్లు నుంచి పాపనపోయిన కోటయ్య, పోటు పెదకోటయ్య ద్విచక్ర వాహనంపై స్వగ్రామం కెల్లంపల్లి వెళ్తున్నారు. ఈక్రమంలో కెల్లంపల్లి - ఉల్లగల్లు రెండు గ్రామాల మధ్య బొలేరా వాహనం బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న పోటు పెదకోటయ్య(59) కాలు తెగి రోడ్డుపై పడింది. వాహనం నడుపుతున్న పాపనపోయిన కోటయ్య చేయి విరిగింది. వెంటనే 108లో దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అక్కడినుంచి తీవ్రంగా గాయపడిన పెదకోటయ్యను గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.కమలాకర్ పరిశీలించారు

విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు

పీసీపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన ఇద్దరు విద్యార్థినులకు ఆదివారం ఉపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన జి.పూర్ణశ్రీ, జి.మమతలు జనరల్‌సైన్స్ సబ్జెక్టులో 100 కి 100మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. వీరిని పైచదువులకు ప్రోత్సహించేందుకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు సీహెచ్ పద్మావతి వారికి వాచ్‌లను అందజేసి అభినందించారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు టీవీ శేషారావు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతిని అందజేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను బోధించడమే కాకుండా ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందించి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న అధికారులు

వెలిగండ్ల(కనిగిరి), జూన్ 8(ఆంధ్రజ్యోతి) యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆర్డీవో జి.కేశవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యోగా మందిరంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు యోగాసనాలు వేయడంవల్ల ఆరోగ్యకరంగా ఉండగలమన్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో యోగా దినోత్సవం నిర్వహించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ డానియల్ జోసెఫ్, యోగా శిక్షకులు స్వర్ణ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ముండ్లమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన రైతులందరికీ అందజేయటం జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి కె.సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండంలోని వేముల, కమ్మవారిపాలెం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ప్రీ ఖరీఫ్ కార్యక్రమానికి సర్పంచ్ గజ్జల ఆదెమ్మ అధ్యక్షత వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు అనువైన కంది పంటలోని ఎల్‌ఆర్‌జీ 52, బీఎంఎస్‌ఆర్ 736 రకాల గురించి వివరించారు. బూజు తెగులు, ఎండు తెగులు నివారణ, వాటి సస్యరక్షణ పద్ధతులు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధరకాల పథకాలు పీఎం కిసాన్, ప్రధాన మంత్రి పసల బీమా యోజన, ప్రధానమంత్రి ముద్ర యోజన తదితర పథకాల గురించి రైతులకు వివరించారు. బాపట్ల శాస్త్రవేత్త ఎం.ఉష మాట్లాడుతూ భూసార పరీక్షలు, వాటి యాజమాన్యం, తెగుళ్లను తట్టుకొనే వరి రకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో కీర్తి, రామిరెడ్డి, టీడీపీ నాయకుడు బేతా కోటిరెడ్డి, హెచ్ఈవో స్వర్ణలత, నిర్మల, వేణుగోపాల్, ఎంటీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

9-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	41	28
నరసరావుపేట	39	29
బాపట్ల	39	28
రెంటచింతల	39	29
చీరాల	39	28


డీఈవో కార్యాలయ ఆవరణలో బైఠాయించిన ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్స్.. వద్దు

- మాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్
- సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్‌పై సంఘాల ఆందోళన
- విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను వెబ్ ఆప్షన్స్‌లో నిర్వహిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు నిరసనగా ఆదివారం గుంటూరులోని డీఈవో కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సంఘాల నాయకులతో జరిపిన చర్చల్లో మాన్యువల్ విధానంలోనే ఎస్‌జీటీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖాధికారులు హామీ ఇచ్చారన్నారు. అయితే వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎంఈవోల ద్వారా ఒత్తిడి సరికాదన్నారు. ఒక్కొక్కరు 3 వేలకుపైగా ఆప్షన్స్ పెట్టుకోవడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. ఐక్యవేదిక నాయకులు కళాధర్, పెదబాబు, మక్కెన శ్రీనివాసరావు, జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ స్వల్పంగా ఉండే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక తప్పులు జరిగాయన్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ హామీ అమలు చేయకపోతే విద్యాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఐక్యవేదిక నాయకులు రాజశేఖర్, సుబ్బారెడ్డి, మ హమ్మద్ ఖాలీద్, నరసింహారావు, సోషలిజం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రజిత్, మహమ్మద్ ఉస్మాన్, మోహనరావు, రామకృష్ణ, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, సాంబయ్య, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా అవార్డులు : కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం సోమవారం మధ్యాహ్నం 2గంటలకు సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కారుమూరి హనుమంతరావు కాలనీలోని ఈ హాలులో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతోపాటు అవార్డులు అందించటం జరుగుతుందన్నారు.

కమిటీలు సరే.. సేవలు?

- కొలువుదీరిన యార్డు పాలక వర్గాలు
- గత వైసీపీ పాలనలో అలంకారప్రాయం..
- ఐదేళ్లు మార్కెట్ యార్డుల లక్ష్యం నిర్వీర్యం
- ఇప్పటికైనా నూతన కమిటీలు చొరవ తీసుకోవాలి
- నిలిచిన సేవలు అమలవుతాయని ఆశిస్తోన్న అన్నదాతలు

రైతుల కోసం.. అన్నదాతల సేవలో.. భూమి పుత్రులను బాగు చేయాలని.. దళారుల దోపిడీ నుంచి గట్టెక్కించాలి.. ఇలా ఎన్నో కార్యక్రమాల బాధ్యత వ్యవసాయ మార్కెట్ కమిటీలది. అయితే గత ఐదేళ్లు పేరుకే పాలక వర్గాల నియామకాలు జరిగాయే కానీ యార్డుల లక్ష్యాలను పూర్తిగా విస్మరించారు. అలంకార ప్రాయంగా మారిన పాలకవర్గాలు రైతుల గురిం చి.. వారి సమస్యల గురించి కనీస ఆలోచనలు చేయలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చక్కదిద్దే క్రమంలో మార్కెట్ యార్డులకు పూర్వ వైభం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో చాలావరకు మార్కెట్‌యార్డుల పాలక వర్గాల నియామకాలు జరిగాయి. ఈ క్రమంలో ఇప్పటి నుంచైనా ఆయా పాలకవర్గాలు రైతుల సేవలో నిమగ్నమవ్వాల్సిన బాధ్యత ఉంది. రైతుల నుంచి ఆదాయం పిండుకోవడమే కాకుండా వారి బాగోగుల గురించి ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు. కొత్త కమిటీలు కొలువుదీరడంతో నిలిచిపోయిన యార్డుల సేవలు మళ్లీ అమలవుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు.

నరసరావుపేటలో నిలిచిపోయిన శీతల గిడ్డంగి



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
మార్కెట్ యార్డుల పాలకవర్గాల నియామకం చాలావరకు ఒక కొలిక్కి వచ్చింది. ఆయా పాలకవర్గాల ప్రమాణ స్వీకారాలు, బాధ్యతల స్వీకరణలు ఇప్పటికే చాలవరకు జరిగాయి. యార్డుల ద్వారా అన్నదాతలకు ఎన్నో రకాల సేవలు గతంలో అందేవి. అయితే ఆ సేవలన్నీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిపోయాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం యార్డుల ఖాతాల్లో చేరుతున్నా ఆ నిధులను వారి కోసం ఖర్చు చేయడంలేదు. గతంలో రైతుబంధు, లింకురోడ్ల నిర్మాణాలు, వైద్య శిబిరాల నిర్వహణ, గోదాముల నిర్మాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో జరిగేవి. అయితే గత వైసీపీ హయాంలో ఇలాంటి కార్యక్రమాల ఊసే లేదు. అన్నదాతలకు అందించాల్సిన పథకాలను కూడా కొన్నేళ్లుగా అమలు చేయడంలేదు. పైగా నిధులు ఏమయ్యాయో అనేది తెలియడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల కమిటీల పరిధిలో కొత్త పథకాలు అమలు జరగలేదు. ఉన్న పథకాలనే అటకెక్కించి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టారు. యార్డుల నుంచి ఏ ఒక్క ప్రయోజనం లేదని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ-మార్కెటింగ్ (మిగతా 6వ పేజీలో)

ఈఏపీసెట్‌లో.. భళా

- సత్తాచాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- ఆరో ర్యాంకుతో పాటు ఇంజనీరింగ్‌లో 100 లోపు 20 ర్యాంకులు
- ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో 28, 32 తదితర ర్యాంకులు


తారికశ్రీ ఉమాశంకర్


విక్రమ్‌లేవీ


రేవంత్‌కు స్వీటు తినిపిస్తున్న వెంకటేశ్వరరావు

గుంటూరు(విద్య), నరసరావుపేట టౌన్, రేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ -2025లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు త్యుత్తమ ఫలితాలు సాధించారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో గుంటూరు నగరానికి చెందిన విక్రమ్‌లేవీ ఇంజనీరింగ్ విభాగంలో ఆరో ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాడు. ఇంజనీరింగ్ విభాగం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో కె.పార్థసారథి 19, ఎ.నోషిక్‌సాయి 25వ ర్యాంకుతో పాటు 100 లోపు 20 మంది ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగం లో రేపల్లెకు చెందిన వల్లభనేని వెంకటేశ్వరరావు, వాణి దంపతుల కుమారుడు రేవంత్ 48వ ర్యాంకు సాధించాడు. తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో రేవంత్ 43వ ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్‌లో 627 ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో తారికశ్రీ ఉమాశంకర్ 28, కారుమంచి విక్రాంత్ 32, షేక్ వహీమా 60, వేముల అవంతి చేతన్ 67, ఎస్ జడ్సన్ ప్రసన్న 95వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన ఎస్ రక్షిత ఇన్నా 72వ ర్యాంకు, నరసరావుపేటకు చెందిన ఎస్‌కే నిహాల్‌పర్విజ్ 74వ ర్యాంకు సాధించారు. ఇక ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షకు 33,013 మంది విద్యార్థులు హాజరుకాగా 23,536 మంది అర్హత సాధించారు. వీరిలో బాలురు 12,747, బాలికలు 10,789 మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షకు 6,680 మంది విద్యార్థులు హాజరు కాగా 6,198 మంది అర్హత సాధించారని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు.

హాస్టళ్లను వీడరంట?

సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ల బది'లీలలు'

- ఖాళీలు చూపకుండా ఇష్టారాజ్యంగా బదిలీలు
- ఉద్యోగ సంఘాల నుంచి సిఫార్సు లేఖల కొనుగోలు
- అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధం

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏళ్లగా ఒకే చోట ఉంటున్నారు.. విద్యార్థుల సంక్షేమం పట్టదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. అక్రమాలపై ఆరోపణలు వస్తున్నాయి.. బదిలీలతో హాస్టళ్ల ప్రక్షాళన జరుగుతుందని అందరూ అనుకున్నారు.. కానీ అలా జరగలేదు. సిఫార్సు లేఖలు కొనుగోలు చేసి కొందరు.. ముడుపులు ఇచ్చి కొందరు.. ఫోకల్ పాయింట్లు చూపి మరి కొందరు.. బదిలీల నుంచి తప్పించుకుంటున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని సాంఘీక సంక్షేమ శాఖ వెల్ఫేర్ ఆఫీసర్ల బదిలీల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల స్థాయిల్లో 70 మందికిపైగా వెల్ఫేర్ ఆఫీ సర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలి. అయితే కొందరు దీర్ఘకాలికంగా ఒకే చోట పని చేసేందుకు (మిగతా 6వ పేజీలో)



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

తొలిరోజే.. 10 వేల టిక్కీలకుపైగా

- ఆదివారం సాయంత్రం నుంచే ప్రారంభమైన ఎరైవల్స్
- నేటి ఉదయం 7 గంటల నుంచి కొనుగోళ్లకు వ్యాపారులు సిద్ధం

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ఆదివారం సాయంత్రం మిర్చియార్డు గేట్లు తెరుచుకున్నాయి. రైతులు తమ వద్ద నిల్వ ఉన్న టిక్కీలను ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో తీసుకురావడం ప్రారంభించారు. యార్డు ప్రాంగణమంతా ఖాళీగా ఉండటంతో వాహనాలను కమీషన్ ఏజంట్ల దుకాణాల వద్ద దిగుమతి చేశారు. తొలి రోజే నాన్ ఏసీ వెరైటీ మిర్చి టిక్కీలు 10 వేలకుపైగా వచ్చాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి వేలం ప్రారంభమైన తర్వాత కొనుగోళ్లకు వ్యాపారులు సిద్ధమయ్యారు. కొత్త సరుకు ఇప్పుడల్లా వచ్చే పరిస్థితి లేని దృష్ట్యా కచ్చితంగా ధర పెరిగేందుకు ఆస్కారం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వాహనాలు ప్రధాన ముఖద్వారం, సత్తెనపల్లి, నరసరావుపేట, తాడికొండ, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి వచ్చేవి నల్లపాడు రోడ్డులోని గేట్ల ద్వారా లోపలికి అనుమతించారు. గ్రామాల నుంచి ఆదివారం సాయంత్రం, రాత్రి బయలుదేరిన వాహనాలు సోమ వారం వేకువజామున వచ్చే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు.


యార్డుకు వాహనాల్లో మిర్చి టిక్కీలను తీసుకొస్తున్న రైతులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జగన్ అరాచకాలను ప్రత్యక్షంగా చూశాను
- పోలీసులను ఆయుధంగా వాడుకుని దుర్మార్గ పాలన
- వేమూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో మంత్రి పార్థసారథి

వేమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆదివారం రాత్రి వేమూరు మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఛైరపర్సన్‌గా గొట్టిపాటి పూర్ణకుమారి, పాలకవర్గ సభ్యుల చేత మార్కెటింగ్ శాఖ ఆర్జేడి కాకుమాను శ్రీనివాసరావు యార్డు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గడచిన జగన్ పాలనలో అరాచకాలను తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. కొన్ని సందర్భాల్లో ఆ బాధను అనుభవించిన వ్యక్తుల్లో తాను ఒకరినని తెలిపారు. ప్రతిపక్షాలను బలహీన పరచాలని, వేధింపులకు గురి చేయాలని జగన్ ముఖ్యమంత్రి హోదాలో ఆలోచించే వారన్నారు. ఐదేళ్ల పాలనలో ఏనాడు అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. పోలీసులను ఆయుధంగా వాడుకుని ఇష్టారాజ్యంగా అక్రమ కేసులను పెట్టి దుర్మార్గపు పాలన కొనసాగించారని విమర్శించారు. దేశంలో అమరావతిని ఆదర్శవంతమైన రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృ షి చేస్తుంటే, ఓర్వలేని తనంతో భూములు ఇచ్చిన మహిళలను కించపరుస్తూ తన మీడియా ద్వారా మాట్లాడించడం ఎంతవరకు సమంజసమో అందరూ ఆలోచించాలన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అనేక కుయుక్తులను జగన్ పన్నుతున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలతో పాటు ప్రాణాలు తీసే మద్యాన్ని తీసుకొచ్చిన జగన్ ఆలోచనలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. జగన్ పాలనలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన పారిశ్రామికవేత్తలంతా తిరిగి రాష్ట్రానికి వస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్, ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తోన్న కూటమి పాలనకు ప్రజలు సంపూర్ణంగా ఆశీర్వాదాలు అందించాలన్నారు. చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు సృష్టించేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని వాటిని ప్రజలు బలంగా తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రం బాగుకోసం మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు పదవులని, ఇందులో భాగంగానే వేమూరు యార్డు కమిటీ ఛైరపర్సన్‌గా గొట్టిపాటి పూర్ణకుమారిని నియమించడం జరిగిందన్నారు. మూడు పార్టీలతో కలిసిన కూటమి ప్రభుత్వంలో సంవత్సర కాలంలోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. 2014లో ఏర్పడిన వేమూరు యార్డును చంద్రబాబు ఆశీస్సులతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. వైసీపీ పాలనలో యార్డులో దోపిడీ జరిగిందని రైతులను మోసగించి కోట్లాది రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. మంచి రోజులు వచ్చాయని త్వరలో సొసైటీలు, ఆలయ కమిటీలను ప్రకటిస్తామన్నారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి





సంద్రం.. సందడి


సూర్యలంక సముద్రతీరంలో పోటెత్తిన ప్రజానీకం

సూర్యలంకకు పోటెత్తిన ముస్లింలు

బాపట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరం ఆదివారం జనసంద్రంగా మారింది. సముద్ర స్నానాలు, ఇసుకలో చిన్నారులు ఆటలతో సందడి చేశారు. శనివారం బక్రీద్ ప్రార్థనలు చేసుకుని ఆదివారం సముద్రస్నానాలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు కుటుంబాలతో తరలివచ్చారు. ఉద యం నుంచి సాయంత్రం వర కు వారు తీరంలో సరదాగా గడిపారు. పాగురు వైపు నుంచి ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ వరకు పర్యాటకులతో నిండిపోయింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


జనకవరంలో రైతు ఆత్మహత్యపై విచారణ చేస్తున్న త్రీమెన్ డివిజన్ కమిటీ ప్రతినిధులు

పంగులూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనకవరంలో అప్పుల భారంతో గత నెల 23న తలపనేని శ్రీనాథ్ ఆత్మహత్యపై ఆదివారం చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ ఎండీ మొయిద్దీన్, ఏవో సుబ్బారెడ్డి విచారణ చేపట్టారు. వ్యవసాయంలో వచ్చిన నష్టాలు, అప్పుల వివరాలను శ్రీనాథ్ భార్య వందన ద్వారా ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రూ.6.50 లక్షలకు సంబంధించిన నోట్లను పరిశీలించారు.వెల్లలచెరువు పీఏసీఎస్‌తో పాటు పంగులూరు ఏపీజీబీ, ఎస్‌బీఐ బ్యాంకుల ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణం రూ.12,18,437 ఉన్నట్లు గుర్తించారు. రైతు ఆత్మహత్యకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. బాధిత కుటుంబానికి 3 సెంట్ల స్థలం, గృహ నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సింగారావును ఆర్డీవో ఆదేశించారు.వీరి వెంట ఆర్ఐ శ్వేత, ఎస్ఐ వినోద్‌బాబు, నేతలు గుర్రం వెంకటరావు, బాచిన హరిబాబు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం


ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఈపురుపాలెం (చీరాల), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని కోసం అలుపెరుగని పోరాటం సాగించిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య అని, సాక్షి ఛానల్లో లైవ్ షో నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్), డిబేట్‌లో పాల్గొని అమరావతి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని చీరాల కూటమి మహిళలు డిమాండ్ చేశారు. సాక్షి నిర్వహించిన లైవ్‌షోపై ఇప్పటికే రాష్ట్రమంతా ఆగ్రహ స్వరం వినిపిస్తున్న సంగతి పాఠకులకు విదితమే. ఈసందర్భంగా చీరాల కూటమి మహిళలు ఈపూరుపాలెం పోలీసులకు కేఎస్ఆర్, కృష్ణంరాజులపై ఫిర్యాదు చేశారు. రాష్ట్ర రాజధాని లేకుంటే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, రాజధాని కోసం పోరుబాట పట్టిన వారిపై ఇంగితం లేకుండా మాట్లాడం అన్యాయమన్నారు. వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సుమోటోగా కేసు నమోదు చేయాలి : పిన్నింటి శ్రీదేవి

అద్దంకి : అమరావతి మహిళలను వేశ్యలు అభివర్ణిస్తూ డిబేట్‌లో మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని అద్దంకి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు పిన్నింటి శ్రీదేవి ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు.

ప్రజలకు జగన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు
- రాష్ట్ర రాజధానిపై దుష్ప్రచారంతో దాడి
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విధ్వంసాలు, కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్లించేందుకే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, తన అక్రమ మీడియాతో అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. దీనిపై ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆచార్య నాగార్జునుడు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రాంతం అమరావతి అని పేర్కొన్నారు. ప్రముఖ బౌద్ధక్షేత్రం, శాతవాహనుల రాజధాని, బడుగు బలహీన వర్గాల అధికంగా ఉన్న ప్రాంతం అమరావతి అన్నారు. ఇంతటి పవిత్రమైన ప్రాంతంపై తన సొంత ఛానల్‌లో అసత్యప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. జగన్‌రెడ్డి కుంభకోణాలపై ప్రజాదృష్టి మళ్లించేందుకే అమరావతిపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. స్వార్థ రాజకీయం కోసం నీచానికి దిగజారిన జగన్ వైఖరిని ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలు ఖండించాలన్నారు. ఈ తీవ్ర నేరపూరిత ప్రచారంపై ప్రభుత్వం, మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగుచర్యలు తీసుకోవాలన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పర్చూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సోమవారాల్లో జిల్లా కేంద్రమైన బాపట్లకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఏమైన సమస్యలు ఉంటే ఇక్కడే అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో మూల్యాంకనం

చీరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ 2024- 25కు సంబంధించిన 4వ సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ డా. మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనానికి హాజరయ్యే అధ్యాపకులు రిలీవింగ్ సర్టిఫికెట్, పాస్ ఫోటో, ప్రొఫైల్ సర్టిఫికేట్స్‌తో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

మార్టూరు, జూన్8(ఆంధ్రజ్యోతి):స్థానికంగా ఉన్న వెంకయ్య ఆశ్రమంలో ఆదివారం జనసేన నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మందపాటి కిషోర్, ఎస్కే వహీద్, వేముల శ్రీనివాసరావు, సకల ఆంజనేయులు, పానుగంటి హనుమంతరావు, కందుల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నాగార్పమ్మ సంబరాలు


విశేష అలంకరణలో అమ్మవారు

పందిళ్లపల్లి(చీరాల), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్ల పల్లిలో వేంచేసిన కనకనాగార్పమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారంతో మొదలై ఆదివారంతో ముగిసిన ఈ సంబరాలకు సుదూర ప్రాంతల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, వడపప్పు, పానకం చెల్లించారు. ఆద్యంతం దేవస్థాన కమిటీ ప్రతినిధులు వేడుకలను పర్యవేక్షించారు.

పనిగంటలు తగ్గించాలని కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

పర్చూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పని గంటలు తగ్గించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పర్చూరు బొమ్మల కూడలిలో ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 8గంటల పనిని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు కె.శ్రీనివాసరావు, పర్చూరు మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి బండారు చిన్నదాసు, మత్తె డేవిడ్, పోతురాజు కార్మికులు పాల్గొన్నారు.

సముద్రతీరానికి పోటెత్తిన పర్యాటకులు

రామాపురం(చీరాల), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వరస సెలవు దినాలు (బక్రీద్, ఆదివారం) కావడంతో వారాంతంలో పర్యాటకులు వాడరేవు, రామాపురానికి పోటెత్తారు. అంతేకాకుండా ఈ నెల 12తో చిన్నారులకు వేసవి సెలవులు కూడా ముగియనుండడంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. ఫోటో షూట్‌లు, గుర్రపు స్వారీ, బీచ్ డ్రైవ్ వంటి వాటితో పిల్లలు ఆనందంగా గడిపారు. అధికంగా పర్యాటకులు తీరంకు వచ్చినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో స్నానాలు చేసే సమీపంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

వైభవంగా పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మవారు

చినగంజాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 5.30గంటల నుండి వేదపండితులు సకల దేవత ఆవాహిత పూజ, హోమాలు, రత్నాన్యాసం, ధాతున్యాసం, గత్తన్యాసం, యంత్రప్రతిష్ఠ, అమ్మవారి, పోతురాజు, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గోదర్శనం, మహాకుంభాభిషేకం, ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను దంపతులతో నిర్వహించారు. దేవస్థానంలో పోలేరమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని విశేష పూజలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పోటీలలో పాల్గొన్న మున్నంవారిపాలెం ఎడ్లు

హోరాహోరీగా ఎడ్ల పందేలు

పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. మున్నం రామాంజనేయులురెడ్డి జ్ఞాపకార్థం, గ్రామ టైర్లబండి కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటుబండి పోల్‌రాధా బలప్రదర్శన పోటీలలో సత్తా చాటేందుకు హోరాహోరీగా తలపడ్డాయి. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీలో (జూనియర్ విభాగం) పోటీలకు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాలకు చెందిన చెందిన 15 ఎడ్ల జతలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను మంగళగిరి సీఐడీ సీఐ కుక్కల రామకృష్ణారెడ్డి, సైబరాబాద్ రిజర్వు ఆర్ఐ మారుబోయిన నాగరాజురెడ్డిలు గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని రామకృష్ణారెడ్డి అన్నారు. రామకృష్ణారెడ్డి, నాగరాజురెడ్డిలను గ్రామపెద్దలు, నిర్వాహకులు సన్మానించారు. పోటీల్లో సోపిరాల గ్రామానికి చెందిన చెరుకూరి భాస్కరరావు ఎడ్ల జత నిర్ణీత పది నిమిషాల వ్యవధిలో 2743 అడుగులు, ప్రకాశం జిల్లా రాజుపాలేనికి చెందిన పగడం బ్రహ్మారెడ్డి ఎడ్ల జత 2697 అడుగులు, మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన మున్నం రామాంజనేయులురెడ్డి ఎడ్లజత 2139 అడుగులు, బాపట్ల జిల్లా అద్దేపల్లికి చెందిన డొక్కు సుబ్బారావు ఎడ్ల జత 2227 అడుగులు, బాపట్ల, దుర్వాజ్ కొత్తపాలెంకు చెందిన ఎంకే బుల్స్ ఎడ్ల జత 2074 అడుగుల దూరం లాగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేక్షకుల ఈలలు, కేరింతలతో గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. ఎడ్ల పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు సోమవారం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్, గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ఎడ్లబండి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.

కొత్త పరిశ్రమలు వస్తేనే కార్మికులకు ఉపాధి

మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేయిర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్


పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న ఆంజనేయులు, శ్రీనివాసరావు

మార్టూరు, జూన్8 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ పరిశ్రమలుతో పాటు ఇతర రంగాలకు సంబందించి పలు పరిశ్రమల ఏర్పాటుపై వ్యాపారవేత్తలు దృష్టి సారించాలని, తద్వారా కార్మికులకు కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేయిర్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలో మార్టూరు నుండి బల్లికురవ రూట్‌లో నాగరాజుపల్లి మార్గంలో శ్రీభానుఫిల్లింగ్ స్టేషన్ పేరు మీద నూతనంగా పెట్రోలు బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పత్తిపాటి సురేష్ మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమల అభివృద్ధి కారణంగా మార్టూరు గ్రామంలో వేలాదిమంది ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. అదే విధంగా ఇతర రంగాలకు చెందిన పరిశ్రమల స్థాపన ఈ ప్రాంతంలో పెరిగితే మరి కొంతమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం మాజీ అధ్యక్షులు నడింపల్లి హనుమ ప్రసాద్ మాట్లాడుతూ వాణిజ్యపరంగా మార్టూరు ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గ్రానైట్ పరిశ్రమల యజమానులు కామేపల్లి లక్ష్మీప్రసాద్, దేవినేని శ్రీనివాసరావు, వట్టికొండ ఆంజనేయులు, తేలప్రోలు శ్రీనివాసరావు, కందిమళ్ల రఘుబాబు, ముక్కపాటి రవీంద్రబాబు, ఇంకా ఎపర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, శానంపూడి లక్ష్మయ్య, బొల్లాపల్లి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి శిబిరానికి విశేష స్పందన


ఏలూరి నాగేశ్వరరావు, ఎన్‌టీఆర్ చిత్రపటాలు పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి , జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పాఠశాల ఆవరణలో తొలుత నందమూరి తారకరామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించడంలో ఎమ్మెల్యే ఏలూరికి సాటిలేరన్నారు. ప్రజాఆరోగ్య పరిరక్షణ ఒక బాధ్యతగా తీసుకొని నెలనెలా ఎమ్మెల్యే ఏలూరి కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. మచ్చలేని నాయకుడిగా సేవే పరమావధిగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. వైద్యశిబిరాలను ఎన్నికల వరకే కాకుండా నిరంతరం కొనసాగించడం ఏలూరికే సాధ్యమైందన్నారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్న 2గంటల వరకు నిర్వహించిన వైద్యశిబిరంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 155 మందిని శస్త్ర చికిత్సకు రిఫర్ చేశారు. శిబిరానికి హాజరైన వారికి ప్రత్యేక వైద్యబృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మహిళలకు, పురుషులకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, అబ్దుల్‌కలాంఆజాద్, సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, ఆసోది సుబ్బారెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, చెరుకూరి రాఘవయ్య, నక్కల వీర రాఘవులు, బ్రహ్మానందరెడ్డి, బత్తుల శ్రీనివాసరావు, టీ.జయరావు, కొండ్రగుంట శ్రీహరి, బీవీ.రమణారెడ్డి, మోటుమర్రి రామసుబ్బారావు, వి.ఏడుకొండలు, కోకి ఉదయభాస్కర్‌రెడ్డి, కే.రామాంజనేయులు, కే.విష్ణు, జరుబుల సంధ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

పక్కింటి ప్రహరీ కూలి మహిళ దుర్మరణం

- భర్త తల, కాళ్లకు గాయాలు
- చీరాల మరియమ్మపేటలో విషాదం


కూలిన ప్రహరీగోడ


చికిత్స పొందుతున్న ఆనందరావు


రోజ్‌మేరీ(ఫైల్)

చీరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పక్కింటి ప్రహరీగోడ కూలి వివాహిత దుర్మరణం చెందగా, భర్తకు తీవ్రగాయాలై చీరాల్లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే మున్సిపాలిటీ పరిధిలోని మరియమ్మపేటకు చెందిన ఆంద్రా ఆనందరావు, రోజ్‌మేరీ(45) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తెకు వివాహమైంది. మరోకుమార్తె హైదరాబాదులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఆనందరావు పెయింటింగ్ పనితో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇదిలా ఉండగా వీరి ఇంటి పక్కన వెరొకరి ఇంటికి సంబంధించిన గోడ కొంత కాలంగా వాలిపోయి ఉంది. దీంతో యజమానికి పలుమార్లు హెచ్చరించారు. అయితే వారు అదిగో, ఇదిగో అంటూ కాలం వెళ్లదీశారు. ఆదివారం అకస్మాత్తుగా గోడ కూల్చే పని ప్రారంభించారు. దీంతో కొంత ఇబ్బంది పడిన చేసేదేమీలేక వాలిన గోడ ప్రక్కన ఉన్న వీరికి చెందిన నీళ్ల డ్రమ్ములు, డబ్బాలు, వివిధ వస్తువులు పక్కకు మార్చు కుంటున్నారు. అయితే అవతలి వైపున పనులు ప్రారంభించిన వాళ్లు, ఇవతలి ఉన్నవారిని గ్రహించక గోడను కూల్చారు. దీంతో ఒక్క సారిగా భర్త ఆనందరావు, భార్య రోజ్‌మేరీపై గోడ కూలింది. ఈ ఘటనలో భార్య అక్కడి కక్కడే మృతి చెందగా, భర్త తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్త చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందు తున్నాడు. ఈక్రమంలో ప్రాంతంలో విషాదం అలుముకుంది.

కమిటీలు సరే.. సేవలు?

(5వ పేజీ తరువాయి)

విధానాన్ని తీసుకువచ్చి ఆన్‌లైన్‌లో కొనుగోళ్ల జరపాలని నిర్ణయం తీసుకుంది. అయితే ఈ విధానం కూడా పక్కాగా అమలు కాలేదు. ప్రతి మార్కెటింగ్ కమిటీ కొనుగోలు కేంద్రంగా మారాలని ప్రతిపాదించారు. కానీ ఎక్కడా ఉత్పత్తులను కొనుగోలు లేదు. ఈ పరిస్థితుల్లో నూతన పాలకవర్గాలు ఆయా సేవలను తిరిగి అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అటకెక్కిన రైతుబంధు..

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేని పక్షంలో వాటిని యార్డులు కుదవ పెట్టుకుని రుణాలు ఇచ్చేందుకు గతంలో రైతుబంధు పథకం అమలు చేశారు. అయితే ఈ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఈ పథకంలో పంట దిగుబడులను నిల్వ చేసుకుని ఆ విలువలో 80 శాతం వరకు రుణంగా ఇచ్చే వారు. ధర వచ్చాక అయా ఉత్పత్తులను విక్రయించి రుణాలను తిరిగి తీర్చుకునే వెసులుబాటును కమిటీలు కల్పించేవి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 24 యార్డుల పరిధిలో లక్షల మంది ఉన్నా ఒక్క రైతుకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం అందలేదు. దీంతో ఉత్పత్తులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

రోడ్ల నిర్మాణాన్ని విస్మరించారు

వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రోడ్లను మార్కెటింగ్ కమిటీలు నిర్మించాలి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించేవి. గత ఐదేళ్లలో ఒక్క రహదారి కూడా వేయలేదు. అసలు ప్రతిపాదనలు కూడా లేవు.

వైద్య శిబిరాలు లేవాయె

రైతులు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా ఉండే పాడిసంపద అభివృద్ధికి కూడా మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసేవి. ఏడాదికి నాలుగు పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేవి. గత ఐదేళ్లు పశు వైద్యశిబిరాల నిర్వహణ ఊసే మరిచారు.

నిలిచిన గోదాముల నిర్మాణం

వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్లలో ఒక్కటి కూడా నిర్మించలేదు. దీని వల్ల ఆదాయం కోల్పోవడమే కాకుండా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ధరల దోపిడీ..

మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల ధరలను ప్రతి రోజు కమిటీలు ప్రకటించాలి. రైతుకు ఇవ్వాల్సిన ధరను అమలయ్యేలా కృషి చేయాలి. కనీసం ధరల పట్టికను కూడా యార్డులు నిర్వహించడం లేదని రైతులు వాపోతున్నారు. దీని వల్ల తాము దోపిడీకి గురౌతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పాపాయిపాలెం (చీరాల), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వయసుతో సంబంధం లేకుండా ఆట పాటల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసంతో పాటు లక్ష్యాలపై దృష్టి పెరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే, యువనాయకులు గౌరీ అమర్నాధ్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరస్థులను చట్ట ప్రకారమే శిక్షించాలి

చీరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నేరానికి పాల్పడిన వారినందరిని చట్ట ప్రకారమే శిక్షించాలి గానీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే దుందుడుకు చర్య సబబు కాదని ఏబీఎస్పీ(ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ) రాష్ట్ర కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ అన్నారు. తెనాలిలో పలువురు యువకులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు గొర్రెపాటి రవికుమార్, డొక్కా జగన్‌మోహన్, కాటి మార్క్, దానియేలు, పుల్లయ్య, అర్జునరావు, సుధాకర్, వందనం, ఆదాము, ఎలీషా, పృథ్వీ, శ్రీను, నాగయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

21న ఐదువేల మందితో యోగా సాధన

అద్దంకి, జూన్8(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవము సందర్భంగా ఈ నెల 21న అద్దంకిలో ఐదువేల మందితో యోగసనాలు వేయనుననట్లు మున్సిపల్ కమీషనర్ రవీంద్ర అన్నారు. యోగా శిక్షణలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వృద్ధులకు శిక్షణ నిర్వహించారు. పలువురు వృద్ధులు ఆసక్తిగా పాల్గొని యోగసనాలు వేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి, జూన్8 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా శాంతికళ్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. అన్నదానం నిర్వహించారు.

రాతి మండప నిర్మాణానికి విరాళాలు

అద్దంకి, జూన్8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణానికి చెందిన కల్లగుంట మాధవరావు, అన్నపూర్ణ దంపతులు రూ.10,116, కుమార్తె పావని రూ.10,116లను ఆలయ సిబ్బందికి అందజేశారు.

హాస్టళ్లను వీడరంట?


(5వ పేజీ తరువాయి)

అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ఆ ఇద్దరి కనుసన్నల్లోనే..

సాంఘీక సంక్షేమ శాఖలో ఇద్దరు అధికారుల కనుసన్నల్లోనే బదిలీల ప్రక్రియ జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన ఆ ఇద్దరు అధికారులు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని హాస్టల్లో కూర్చుని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ సహాయంతో బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఫైల్ కలెక్టరేట్‌కు పంపించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారీ మొత్తాలు చేతులు మారినట్లు అర్హులైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. బదిలీల్లో అక్రమాలపై సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి డీడీ జోబేర దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించలేదు.

- గుంటూరులోని ఓ కళాశాల సమీపంలోని హాస్టల్లో మహిళ వెల్ఫేర్ ఆఫీసర్ దాదాపు తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఓ ఉద్యోగ సంఘం నుంచి సిఫార్సు లేఖ కొనుగోలు చేసి దానిని అడ్డుపెట్టుకుని బదిలీ నుంచి తప్పించుకున్నారని ఆరోపణ.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ హాస్టల్లో విద్యార్థులు ఎక్కువయ్యారని చూపి మూడు హాస్టళ్లగా విభజించారు. ఇక్కడ పోస్టింగ్ కోసం సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఇందుకు భారీ మొత్తంలో ఉన్నతాధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా అమరావతి ప్రాంతంలోని ఓ హాస్టల్ నుంచి వెల్ఫేర్ ఆఫీసర్ ఇప్పటికి రెండుసార్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదు.
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు ఏడు హాస్టళ్ల విలీనం చేశారు. ఇక్కడ పని చేసిన వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. రోజూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెట్టి ఇతర వ్యాపకాల్లో ఉంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.
- కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు 10, 20 మంది విద్యార్థులు ఉన్నట్లు చూపి యథాస్థానాల్లో కొనసాగేలా చూసేందుకు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం.
- కొల్లిపర సమీపంలోని ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గుంటూరు నగరంలో కూడా పనిచేస్తున్నారు. తన భార్య ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నందున ఈ భాగంలో పాయింట్లు పొంది బదిలీ కాకుండా చేసుకున్నట్లు సమాచారం.



కలెక్టరేట్ నిర్మాణమయ్యేనా ?

- పుష్కరకాలం నుంచి ముందుకు పడని అడుగులు
- అధికారులు, ప్రజలకు ఇబ్బందిగా పాత భవనం
- కొత్తది ఏర్పాటుకు మహానాడులో తీర్మానం
- తాజాగా అధికారులు మరోసారి ప్రతిపాదనలు
- రూ.58 కోట్లు అవసరమని కలెక్టర్ లేఖ



కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదించిన నగరంలోని టీబీ ఆసుపత్రి ప్రాంగణంలోని స్థలం

నెల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రిటీషు కాలంనాటి భవనంలో నేటికీ కలెక్టరేట్ కొనసాగుతోంది. అందులో కనీస సౌకర్యాలు లేవు.. ఎప్పుడు పెచ్చులూడుతాయో తెలియదు.. అంతా ఇరుకు ఇరుకే... అయినా కొత్త కలెక్టరేట్ నిర్మాణంలో కదలికలేదు. తొలుత ప్రభుత్వం నిధులిచ్చినా కోర్టు కేసుతో బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత కోర్టు కేసు క్లియర్ అయినా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు... ఇలా పుష్కరకాలం గడిచిపోయింది. అయితే తాజాగా మరోసారి కలెక్టరేట్ నిర్మాణంలో కదలిక వచ్చింది. ఇటీవల మినీ మహానాడులో తీర్మానించడం, ఆ వెంటనే కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో నిర్మాణంపై ఆశలు రేగాయి. మరి ఈసారైనా అనుమతులు లభిస్తాయా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

కాలానుగుణంగా వసతులు అవసరం

మారుతున్న పాలనకు అనుగుణంగా అవసరాలు పెరుగుతుండడంతో ప్రస్తుతమున్న కలెక్టరేట్ ఇరుకుగా మారింది. రికార్డులు కూడా సక్రమంగా పెట్టుకోలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే నీరు కారడం, ఉరవడం, పెచ్చులు ఊడిపడుతుండడంతో ఉద్యోగులు భయంభయంగానే విధులు నిర్వహిస్తున్నారు. నగరంలోని పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే పాలనాపరంగా చాలా ప్రయోజనాలుంటాయని పుష్కరకాలం క్రితం అప్పటి అధికార వర్గాలు భావించాయి. అంతేకాక అక్కడికి సమీపంలోనే కలెక్టర్, జేసీ బంగ్లాలు ఉన్నాయి. సమీపంలోని జడ్పీ కార్యాలయం ఆవరణలో కీలకమైన జడ్పీ, డీపీవో, డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా ఎమర్జెన్సీ సెంటర్ ఉండటం, మరోవైపు కార్పొరేషన్ కార్యా లయం ఉండడం కలిసొచ్చే అంశం. ఇక ప్రస్తుతమున్న కలె క్టరేట్ చుట్టూ నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. దీంతో ప్రతి వారం పీజీఆర్ఎస్‌కి వచ్చే ప్రజలకు, అధికారులకు పార్కింగ్ సమస్య కూడా ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య లేని, విశాలమైన టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్ నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. అందు కు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కానీ స్థలం, టెండర్ల వ్యవహారాలు కోర్టు మెట్లక్కడంతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి ఆదిలోనే బ్రేక్ పడింది. కాగా కోర్టు కేసుల నుంచి కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం మార్గం సుగుమమైంది. దీంతో తాజాగా అంచనాలు తయారు చేసి రూ.58 కోట్లు అవసరమని అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పట్టించుకోలేదు.

ఫైలు కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలెక్టరేట్ నిర్మాణ ప్రతిపాదనల్లో కదలిక వచ్చింది. గతంలో ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను ఆమోదించాలని తాజాగా మరోసారి కలెక్టర్ ఓ ఆనంద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన నెల్లూరు పార్లమెంటు టీడీపీ మినీ మహానాడులో కూడా కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి తీర్మానించారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలంతా నిర్ణయించారు. దీంతో నెల్లూరులో నూతనంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మించేందుకు అడుగు లు ముందుకు పడుతున్నాయి. కలెక్టరేట్ ఆవరణలో ఉండే కార్యాలయాన్నింటిని కూడా కొత్త కలెక్టరేట్ నిర్మించే ప్రాంతానికి తరలించాలన్న ఆలోచన కూడా జరుగుతోంది. త్వరలోనే అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు ఉన్నతాధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై డీఆర్వో ఉదయభాస్కర్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. దీనిపై ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



నగరంలోని మినీ బైపాస్‌లో ఆదివారం జరిగిన ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునఃఆవిష్కరణలో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

పేదల అభ్యున్నతికి పాటుపడిన ఆనం వెంకటరెడ్డి

- మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి మాజీ మంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి ఎంతగానో పాటుపడ్డారని పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని రామలింగాపురం మినీబైపాస్‌లో సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో వెంకటరెడ్డి విగ్రహ పునఃఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రూపశిల్పి ఆనం వెంకటరెడ్డి అని కొనియాడారు. ఇరిగేషన్ మంత్రిగా జిల్లాకు నీటి ప్రాజెక్టులను తెచ్చి, రైతులకు ఎంతో మేలు చేశారని చెప్పారు. ఆనం కుటుంబంతో తనకు ఎనలేని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా రాజకీయ ముఖ చిత్రంలో ఆనం వెంకటరెడ్డిది చెరపలేని ముద్ర అని చెప్పారు. రైతు కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో ఎదిగిన కుటుంబం తమదన్నారు. సమస్యల పరిష్కారం కోసం తన తండ్రి వద్దకు కందుకూరు ప్రాంతం నుంచి కూడా ఎడ్లబండ్లపై ప్రజలు వచ్చేవారని చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు తరాలుగా ప్రజాసేవకు ఆనం కుటుంబం అంకితమవుతూ, ప్రజలకు అన్నీ విధాలా అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆనం వెంకటరెడ్డి జీవిత ప్రస్థానాన్ని మనుమరాలు ఆనం కైవల్యారెడ్డి వివరించారు. అనంతరం ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణను, పైలాన్‌ను మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ఆవిష్కరించారు. ఆనం వెంకటరెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రి నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేత దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ మదాసు గంగాధర్, ఆనం సోదరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థికి పదో ర్యాంక్



బద్రిరాజు వెంకటమణి ప్రీతమ్

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్ ఫలి తాల్లో జిల్లాలోని కందుకూరుకి చెందిన బద్రిరాజు వెంకటమణి ప్రీతమ్ పదోర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్, వ్యవ సాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లా వ్యాప్తంగా 11,560 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌కు 8,913 మంది, వ్యవసాయ ఫార్మసీ కోర్సులకు 2,647 మంది పరీక్ష రాశారు. ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు.

- గత నెలలో ఏపీ ఈఏపీ సెట్

ఈఏపీసెట్‌ను మే 19, 20వ తేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌కు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని కావలి పీబీఆర్ విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కోవూరు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు రూరల్ మండల పొట్టేపాళెంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను ఆదివారం విడుదల చేయడంతో ఇంజనీరింగ్‌లో బాలురు 3,213 మంది, బాలికలు 2,780 మంది కలిపి మొత్తం 5,993 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల్లో బాలురు 536 మంది, బాలికలు 1,727 మంది కలిపి మొత్తం 2,263 మంది ఉత్తీర్ణత సాధించి, కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు.

కంప్యూటర్ సైన్స్ చదువుతా...

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్(ఏఐ టెక్నాలజీ)లో ఇంజనీరింగ్ చదవడమే తన లక్ష్యమని ఏపీ ఈఏపీ సెట్‌లో 10వ ర్యాంకు సాధించిన బద్రిరాజు వెంకట మణిప్రీతం తెలిపారు. తనకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ క్యాటగిరిలో 2034 ర్యాంకు వచ్చినందున ప్రతి ష్టాత్మక ఐఐటీ లో తప్పకుండా సీటు వస్తుం దని ధీమాగా ఉన్నట్లు ఆయన తెలి పారు. మణిప్రీతమ్ తల్లిదండ్రులు బద్రిరాజు నారాయణమూర్తి, రజని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తు న్నారు. కాగా ఆయన తాత బద్రిరాజు లక్ష్మీనరసింహరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే. తన తల్లిదండ్రుల దిశానిర్దేశం, గురువుల ప్రోత్సాహం వల్లే తాను ఏపీ ఈఏపీ సెట్‌లో పదో ర్యాంకు సాధించగలిగానని మణిప్రీతమ్ తెలిపారు. ఐఐటీలో విద్యాభ్యాసం చేసి ఏఐ ఆధారిత ప్రయోగాలు, స్టార్టప్ కంపెనీ ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర ర్యాలీలు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంపై అధికారులకు సూచనలిచ్చారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది అంతా పాల్గొనాలని కోరారు.

'సాక్షి'పై తెలుగు మహిళల ఆగ్రహం

నెల్లూరులో భారీ ప్రదర్శన

నల్లచీరలు ధరించి కదంతొక్కిన మహిళలు

జిల్లావ్యాప్తంగా స్టేషన్లలో ఫిర్యాదులు



నెల్లూరు నగరంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

నెల్లూరు (వైద్యం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి చానల్‌లో విమర్శలు గుప్పించని జర్నలిస్టులపై తెలుగు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఆదివారం నల్లచీరలు ధరించిన వారు కథం తొక్కారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తప్పుడు రాతలు రాసిన సాక్షిపై, తప్పుడు కూతలు కూసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన కొమ్మినేనిపై చర్యలు తీసుకోవాలంటూ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు రేవతి మాట్లాడుతూ మహిళలను కించ పరిచేలా వ్యవహరించిన జగన్ అండ్ కోలను శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా మాట్లాడటం సిద్దుచేటన్నారు. మహిళలను కించ పరిచే మాటలు మానకుంటే నాలుక కోస్తామంటూ ఆమె హెచ్చరించారు. ఏపీపై విషం చిమ్ముతున్న సాక్షి పేపరు, టీవీని బ్యాన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

- జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్‌లో నిర్వహించిన డిబెట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌లు, సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు కోరారు. ఆదివారం నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఈ మేరకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు అరుణమ్మ, ఆబీదా సుల్తానా, మాధవి, వనజారెడ్డి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు



వరికుంటపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

- తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

కావలి, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన వైసీపీ నేతలు, ఆ పార్టీ చానల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కావలి పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా, జర్నలిస్టులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పీ. మాధవరావు, నాయకులు భాగ్యమ్మ, శాంతికుమారి, నల్లగొండ్ల వెంగళరావు, రవి, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వృద్ధురాలికి కొవిడ్

- జిల్లాలో 8కి చేరిన కరోనా కేసులు

నెల్లూరు (వైద్యం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని వనంతోపులో మరో కరోనా కేసు నమోదైంది. ఆదివారం ఆ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు(61)కి కరోనా ఉన్నట్లు నిర్ధారణ అయింది. నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఆమెకు కరోనా పరీక్ష చేయగా, కొవిడ్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. కరోనా లక్షణాలు చాలా తక్కువగా ఉండటంతో ఆమెను హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స నిర్వహిస్తున్నారు. దీంతో నెల్లూరు నగరంలో ఐదో కరోనా కేసులు నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా 8 కేసులు నమోదయ్యాయి. ఈ నెల 5న జిల్లాలో 6 కేసులు నమోదు కాగా, 6న మరో కరోనా కేసు నమోదైంది. ఆదివారం కూడా మరో కేసు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కరోనా కేసులు పెరుగుతుండటంతో కరోనాపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కందుకూరు డివిజన్‌లో గాలివాన

- ఈదురుగాలులతో మామిడికి భారీ నష్టం
- పలుచోట్ల విద్యుత్ అంతరాయం

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. డివిజన్‌లోని వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు మండలాల్లో గంటకు పైగా పెనుగాలులతో వర్షం కురవగా కందుకూరు, ఉలవపాడు మండలాల్లో ఉధృతంగా గాలి వీచి, చిరు జల్లులు కురిశాయి. ఈదురు గాలుల ధాటికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో పలు చోట్ల విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో రాత్రి పొద్దుపోయే వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. పెనుగాలులకు కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి తోటల్లో కాయలు రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే ధరలు లేక పండు ఈగ కారణంగా కాయలు నాణ్యత లేక నష్టపోతున్న మామిడి రైతుకు ఈ పెనుగాలులు గోరుచుట్టుపై రోకటిపోటులా మారాయి.

డోంట్ కేర్ !

- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- పెన్నాలో ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు
- నదిలో భారీగా ఏర్పడిన గుంతలు
- చోద్యం చూస్తున్న అధికారులు



పెన్నానదిలోకి ప్రవేశించరాదని అధికారులు అడ్డుగా పెట్టిన గేటు, పక్కనుంచి వెళుతున్న ఇసుక ట్రాక్టర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నదుల్లో ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు. జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఇసుక తవ్వకాలు జరపరాదని ఇప్పటికే ట్రిబ్యునల్ ఆదేశాలు జారీచేసింది. అయితే జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, జమ్మిపాళెం, దీనదయాళ్ నగర్ ప్రాంతాల్లో వందలాది ట్రాక్టర్లు నదిలోకి ప్రవేశించి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నామమాత్రంగా గేటు ఏర్పాటు చేసి దానికి తాళం వేశారు. అయితే గేటు పక్కనుంచి వందలాది ట్రాక్టర్లు ఇసుక కోసం నదిలోకి వెళుతున్నాయి.

- అధిక ధరలకు విక్రయాలు

మాన్‌సూన్ సీజన్ అయినా ఇసుకను అక్రమంగా తరలించుకుంటూ ట్రాక్టర్ల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ వచ్చినప్పటి నుంచి ట్రాక్టర్ ఇసుక ధర రూ.1500 గా ఉంది. అయితే ప్రస్తుతం మాన్‌సూన్ సీజన్ పేరుతో కొందరు ట్రాక్టర్ల యజమానులు రూ.4వేల నుంచి రూ. 5వేలు తీసుకుంటున్నారు.

- నదిలో భారీగా గుంతలు

ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వందలాది ట్రాక్టర్లు నదిలోకి వెళ్లి భారీగా గుంతలు చేస్తున్నాయి. దీంతో పెన్నాకు వరదలు వస్తే సమీప ప్రాంతాల్లోని కాలనీలకు ముప్పు తప్పదని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సి ఉంది.

పరిశీలించి, చర్యలు తీసుకుంటాం

ఈనెల ఒకటి నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఎలాంటి తవ్వకాలు జరపరాదు. ఇప్పటికే పెన్నానదిలోకి ప్రవేశించే ప్రాంతాల్లో గేట్లను ఏర్పాటు చేశాం. అయినా తవ్వకాలు జరుగుతుంటే, పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- షఫీమాలిక్, అర్బన్ తహసీల్దార్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 540

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.9249
వెండి కిలో ధర రూ. 108500
వెండి ఒక గ్రాము రూ.111.50

రక్తదానంతో రోగిని కాపాడిన యువకుడు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ నిమిత్తం ఒక రోగికి అరుదైన ఏ-నెగిటీవ్ బ్లడ్ గ్రూపు అత్యవసరం అయింది. దీంతో ఆదివారం బ్లడ్ డోనర్స్ వాట్సప్ గ్రూప్‌లో చూసిన కందుకూరు పట్టణం ప్రకాశం కాలనీకి చెందిన ఉప్పుటూరి వంశీ విజయవాడకు వెళ్లి రక్తదానం చేసి రోగి నిండుప్రాణం కాపాడాడు. దీంతో అతని బంధువులు వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కలిగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సెంటర్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భక్తులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో ఉన్న ఆలయం రహదారి విస్తరణలో కోల్పోతున్న సందర్భంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వీఆర్ కోటలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్నసభ్యులు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగద్గీత గురించి తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని వీఆర్ కోట గ్రామంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన త్రైత సిద్ధాంత భగద్గీత గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు జి సుధాకర్, కె నరసింహులు, ఎం నాగమ్మ, వి మహేంద్ర, డి మధు, వి కొండలరావు, కె వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో అల్లాడుతున్న జనం

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజుల నుంచి ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడం, 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు భయపడి ఉదయాన్నే ప్రజలు దుకాణా లకు వెళ్లి సరుకులు తీసుకొని 11 గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తా

● నా గెలుపు కోసం కష్టపడిన ఏ ఒక్కరినీ వదులుకోను ● కూటమి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ ఎన్నికలలో 40కి 40 వార్డులు గెలుచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు కృషి చేస్తున్నానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో ఆదివారం కావలి పట్టణ ఎంజీఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు ఎమ్మెల్యేతో పాటు నేతలు పాలాభిషేకం చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన బీసీ నేత జనిగర్ల మహేంద్రయాదవ్, మరో ఐదుగురు వైసీపీ వార్డు ఇన్‌చార్జిలు భారీ ర్యాలీగా సమావేశం వద్దకు వచ్చి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలికి చెందిన బీసీ నేత మహేంద్ర యాదవ్ వారి అనుచరులను, దగదర్తికి చెందిన తాళ్లూరు ప్రసాద్‌నాయుడు వారి అనుచరులను కేంద్ర పార్టీ అనుమతి మేరకు త్వరలో మంత్రుల సమక్షంలో కావలిలో పెద్ద సమావేశం ఏర్పాటుచేసి టీడీపీ లో చేర్చుకోవటం జరుగుతుందన్నారు. తాను కష్టాలలో ఉన్నపుడు చిన్న సహాయం చేసిన ఎవరినీ మరిచిపోనని, కష్టపడి గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానన్నారు. కూటమి గెలుపు కోసం పనిచేసిన బీజేపీ, జనసేన వారిని కూడా కలుపుకుపోయి వారికి కొన్ని సీట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, టీడీపీలోకి వచ్చేవారిని పార్టీలో చేర్చుకోవడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. తనను నమ్మి చంద్రబాబునాయుడు, లోకేష్‌లు టిక్కెట్ ఇచ్చారని, వారి రుణం తీర్చుకునేందుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకూ తాను శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, అమరా వేదగిరి, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, బండి శ్రీనివాసులురెడ్డి, శ్రీహరినాయుడు, బీజేపీ నేతలు గుండ్లపలి భరత్‌కుమార్, కే బ్రహ్మానందం, జనసేన నేతలు పొబ్బా సాయి విఠల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అనారోగ్య కారణాల వలన వివిధ ఆసుపత్రులలో చికిత్స పొంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 29 మంది లబ్ధిదారులకు రూ.25,80,418 చెక్కులను ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆత్మీయ సమావేశం అనంతరం పంపిణీ చేశారు.

ముగిసిన వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రను సన్మానిస్తున్న బీఎంఆర్ ట్రస్ట్ సభ్యులు.

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఫుట్‌బాల్ సీనియర్ కోచ్ ఎస్‌ఏ నవీద్ పర్యవేక్షణలో బీఎంఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడా దుస్తులు, షూస్ అందచేశారు. ఈ కార్యక్రమానికి బిట్రగుంట సీనియర్ క్రీడాకారుడు, అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్లేయర్ మహేంద్ర (మను)ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బర్నాడ్, గౌరవ అధ్యక్షుడు స్వర్ణన్ రాజ్, బీఎంఆర్ యువసేన సమీఉల్లా, సీనియర్ క్రీడాకారులు మార్క్, సునీల్, గౌస్, అశోక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు అరుణరెడ్డి

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో యోగా గురువు అరుణరెడ్డి యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆసనాలు వేయడం వలన శరీర పటుత్వంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బీ బర్నాడ్, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎన్‌ఎస్ యాదవ్, కమిటీ సభ్యులు మన్నెం శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళల ఫిర్యాదు



కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిపై, అక్కడి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ ప్రతినిధులు, జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాంబశివరావుకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి దేవతల రాజధానిగా వ్యాఖ్యానించగా జీర్ణించుకోలేని వైకాపా నేతలు, సాక్షి ఛానల్ డిబేట్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు అమరావతి వేశ్యల రాజధాని అని సంబోధించడం, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు యథావిధిగా డిబేట్‌ను కొనసాగించడం మహిళలను అవమానించడమేనని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సాక్షి ఛానల్, జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినవారిలో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, మహిళా నాయకులు రసూల్‌బీ, ఎస్తేరమ్మ, పార్వతి, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మహాలక్ష్మి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యనిపుణులు మహాలక్ష్మీ ఆధ్వర్యం లో పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది వాసుదేవరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతి నిధు లు డీ రవిప్రకాష్, కే హరినారపరెడ్డి, మదుసూధనరావు, మోడరన్ నరసింహం పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచినీరు



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచి నీరు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని వాకమళ్లవారిపాలెం ఆనకట్ట పక్కనే ఉన్న అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం ఈ ఆనకట్ట పక్కనే ఉన్న చిల్లచెట్ల మొద్దులు ఎక్స్‌కవేటర్‌తో తీస్తుండగా బకెట్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలి పోయింది. దీంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత గ్రంథ పాలకులు ఏ గోవిందరెడ్డి, మేథా హైస్కూల్ కరస్పాండెంట్ టీసీవీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్టోరీ టెల్లింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, గ్రంథాలయాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జనసేన నాయకులు

సంగం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం మజరా అనసూయనగర్ గ్రామంలో శనివారం జనసేన నాయకులు సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని సిమెంట్ రోడ్డుకు రూ. 5 లక్షలు ఉపాధి హామి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను కూటమి ప్రభుత్వంలోని జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ నాయకులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తిరుమలేష్, శ్రీధర్, వరకుమార్, హరీష్, నరసింహ పాల్గొన్నారు.

చెట్టంత నిర్లక్ష్యం...



చేదుడు బావిలో ఏపుగా పెరిగిన చెట్టు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్టుకు చుట్టూ గోడ కట్టినట్లు కనిపిస్తోంది కదూ.. అది ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చేదురు బావి. ఏళ్ల తరబడి ఈ బావి పంపింగ్ స్కీం ద్వారా పట్టణంలోని పలువురికి నీటి అవసరాలు తీర్చుతోంది. అయితే దీని లోపల చిన్నగా ఉన్న పనికి రాని మొక్క పెరిగి పెద్దదై ఇప్పు డు చెట్టుగా మారింది. ప్రారంభంలోనే దీనిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలి మరీ...



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూలంకరణ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న శ్రీఅడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం గడ్డంవారిపల్లి గ్రామం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకుంది. వేదపండితులు అమ్మవారికి గణపతి పూజ, పుణ్య హవచనం, అభిషేకాలు, విశేష అలంకరణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పంచాయతీతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు యోగాంధ్ర ర్యాలీ

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ఉదయం 8 గంటలకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించబడుతుందని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి కొనసాగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హంసవాహనంపై సరస్వతిదేవి అలంకారంలో ఆత్మారామస్వామి



హంస వాహనంపై దర్శనమిస్తున్న ఆత్మారామస్వామి

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో వెలసి ఉన్న ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో ఆత్మారామస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాన్ని సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి పరీక్షలు



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మర్రిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా త్వరలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసి అద్దాలు అందించనున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం నాగరాజుపాడులో ఆదివారం జరిగిన కోదండరామస్వామి, తిమ్మయ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలను ఇచ్చే కార్యక్రమాన్ని నాగరాజుపాడు నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు గంగాధర్, మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ, భీమవరం సొసైటీ చైర్మన్ చిన్నాకెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మతల్లి

గ్రామదేవతకు పొంగళ్లు

ఉదయగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతైన అంకాళమ్మతల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచి గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సమృద్ధిగా ఉండాలని పూజలు చేశారు.

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



అనంతసాగరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద వెలసి ఉన్న ప్రముఖ సోమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సోమసుందరమూర్తి, విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు కాసులపేరు బహూకరణ



అమ్మవారికి బంగారు కాసుల పేరును అందజేస్తున్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు 176 గ్రాముల బంగారు కాసులపేరు మాల బహూకరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మేళతాళాల నడుమ కాసుల పేరు, కాసులను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానంతో రోగిని కాపాడిన యువకుడు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ నిమిత్తం ఒక రోగికి అరుదైన ఏ-నెగిటివ్ బ్లడ్ గ్రూపు అత్యవసరం అయింది. దీంతో ఆదివారం బ్లడ్ డోనర్స్ వాట్సప్ గ్రూప్‌లో చూసిన కందుకూరు పట్టణం ప్రకాశం కాలనీకి చెందిన ఉప్పుటూరి వంశీ విజయవాడకు వెళ్లి రక్తదానం చేసి రోగి నిండుప్రాణం కాపాడాడు. దీంతో అతని బంధువులు వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కలిగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సెంటర్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భక్తులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో ఉన్న ఆలయం రహదారి విస్తరణలో కోల్పోతున్న సందర్భంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వీఆర్ కోటలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్నసభ్యులు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగద్గీత గురించి తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని వీఆర్ కోట గ్రామంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన త్రైత సిద్ధాంత భగద్గీత గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు జి సుధాకర్, కె నరసింహులు, ఎం నాగమ్మ, వి మహేంద్ర, డి మధు, వి కొండలరావు, కె వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో అల్లాడుతున్న జనం

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజుల నుంచి ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడం, 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు భయపడి ఉదయాన్నే ప్రజలు దుకాణా లకు వెళ్లి సరుకులు తీసుకొని 11 గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తా

● నా గెలుపు కోసం కష్టపడిన ఏ ఒక్కరినీ వదులుకోను ● కూటమి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ ఎన్నికలలో 40కి 40 వార్డులు గెలుచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు కృషి చేస్తున్నానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో ఆదివారం కావలి పట్టణ ఎంజీఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు ఎమ్మెల్యేతో పాటు నేతలు పాలాభిషేకం చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన బీసీ నేత జనిగర్ల మహేంద్రయాదవ్, మరో ఐదుగురు వైసీపీ వార్డు ఇన్‌చార్జిలు భారీ ర్యాలీగా సమావేశం వద్దకు వచ్చి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలికి చెందిన బీసీ నేత మహేంద్ర యాదవ్ వారి అనుచరులను, దగదర్తికి చెందిన తాళ్లూరు ప్రసాద్‌నాయుడు వారి అనుచరులను కేంద్ర పార్టీ అనుమతి మేరకు త్వరలో మంత్రుల సమక్షంలో కావలిలో పెద్ద సమావేశం ఏర్పాటుచేసి టీడీపీ లో చేర్చుకోవటం జరుగుతుందన్నారు. తాను కష్టాలలో ఉన్నపుడు చిన్న సహాయం చేసిన ఎవరినీ మరిచిపోనని, కష్టపడి గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానన్నారు. కూటమి గెలుపు కోసం పనిచేసిన బీజేపీ, జనసేన వారిని కూడా కలుపుకుపోయి వారికి కొన్ని సీట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, టీడీపీలోకి వచ్చేవారిని పార్టీలో చేర్చుకోవడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. తనను నమ్మి చంద్రబాబునాయుడు, లోకేష్‌లు టిక్కెట్ ఇచ్చారని, వారి రుణం తీర్చుకునేందుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకూ తాను శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, అమరా వేదగిరి, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, బండి శ్రీనివాసులురెడ్డి, శ్రీహరినాయుడు, బీజేపీ నేతలు గుండ్లపలి భరత్‌కుమార్, కే బ్రహ్మానందం, జనసేన నేతలు పొబ్బా సాయి విఠల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అనారోగ్య కారణాల వలన వివిధ ఆసుపత్రులలో చికిత్స పొంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 29 మంది లబ్ధిదారులకు రూ.25,80,418 చెక్కులను ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆత్మీయ సమావేశం అనంతరం పంపిణీ చేశారు.

ముగిసిన వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రను సన్మానిస్తున్న బీఎంఆర్ ట్రస్ట్ సభ్యులు.

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఫుట్‌బాల్ సీనియర్ కోచ్ ఎస్‌ఏ నవీద్ పర్యవేక్షణలో బీఎంఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడా దుస్తులు, షూస్ అందచేశారు. ఈ కార్యక్రమానికి బిట్రగుంట సీనియర్ క్రీడాకారుడు, అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్లెయర్ మహేంద్ర (మను)ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బర్నాడ్, గౌరవ అధ్యక్షుడు స్వర్ణన్ రాజ్, బీఎంఆర్ యువసేన సమీఉల్లా, సీనియర్ క్రీడాకారులు మార్క్, సునీల్, గౌస్, అశోక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు అరుణరెడ్డి

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో యోగా గురువు అరుణరెడ్డి యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆసనాలు వేయడం వలన శరీర పటుత్వంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బీ బర్నాడ్, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, కమిటీ సభ్యులు మన్నెం శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై
చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళల ఫిర్యాదు



కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిపై, అక్కడి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ ప్రతినిధులు, జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాంబశివరావుకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి దేవతల రాజధానిగా వ్యాఖ్యానించగా జీర్ణించుకోలేని వైకాపా నేతలు, సాక్షి ఛానల్ డిబేట్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు అమరావతి వేశ్యల రాజధాని అని సంబోధించడం, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు యథావిధిగా డిబేట్‌ను కొనసాగించడం మహిళలను అవమానించడమేనని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సాక్షి ఛానల్, జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినవారిలో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, మహిళా నాయకులు రసూల్‌బీ, ఎస్తేరమ్మ, పార్వతి, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మహాలక్ష్మి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిం చారు. వైద్యనిపుణులు మహాలక్ష్మి ఆధ్వర్యం లో పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపణీ చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది వాసుదేవరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతి నిధు లు డీ రవిప్రకాష్, కే హరినారపరెడ్డి, మదుసూధనరావు, మోడరన్ నరసింహం పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచినీరు



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచి నీరు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని వాకమళ్లవారిపాలెం ఆనకట్ట పక్కనే ఉన్న అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం ఈ ఆనకట్ట పక్కనే ఉన్న చిల్లచెట్ల మొద్దులు ఎక్స్‌కవేటర్‌తో తీస్తుండగా బకెట్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలి పోయింది. దీంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత గ్రంథ పాలకులు ఏ గోవిందరెడ్డి, మేథా హైస్కూల్ కరస్పాండెంట్ టీవీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్టోరీ టెల్లింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, గ్రంథాలయాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జనసేన నాయకులు

సంగం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం మజరా అనసూయనగర్ గ్రామంలో శనివారం జనసేన నాయకులు సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని సిమెంట్ రోడ్డుకు రూ. 5 లక్షలు ఉపాధి హామి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను కూటమి ప్రభుత్వంలోని జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ నాయకులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తిరుమలేష్, శ్రీధర్, వరకుమార్, హరీష్, నరసింహ పాల్గొన్నారు.

చెట్టంత నిర్లక్ష్యం...



చేదుడు బావిలో ఏపుగా పెరిగిన చెట్టు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్టుకు చుట్టూ గోడ కట్టినట్లు కనిపిస్తోంది కదూ.. అది ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చేదురు బావి. ఏళ్ల తరబడి ఈ బావి పంపింగ్ స్కీం ద్వారా పట్టణంలోని పలువురికి నీటి అవసరాలు తీర్చుతోంది. అయితే దీని లోపల చిన్నగా ఉన్న పనికి రాని మొక్క పెరిగి పెద్దదై ఇప్పు డు చెట్టుగా మారింది. ప్రారంభంలోనే దీనిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలి మరీ...



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూలంకరణ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హంసవాహనంపై సరస్వతిదేవి అలంకారంలో ఆత్మారామస్వామి



హంస వాహనంపై దర్శనమిస్తున్న ఆత్మారామస్వామి

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో వెలసి ఉన్న ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో ఆత్మారామస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాన్ని సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి పరీక్షలు



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మర్రిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా త్వరలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసి అద్దాలు అందించనున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం నాగరాజుపాడులో ఆదివారం జరిగిన కోదండరామస్వామి, తిమ్మయ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలను ఇచ్చే కార్యక్రమాన్ని నాగరాజుపాడు నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు గంగాధర్, మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ, భీమవరం సొసైటీ చైర్మన్ చిన్నాకెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మతల్లి

గ్రామదేవతకు పొంగళ్లు

ఉదయగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతైన అంకాళమ్మతల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచి గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సమృద్ధిగా ఉండాలని పూజలు చేశారు.

వైభవంగా అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న శ్రీఅడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం గడ్డంవారిపల్లి గ్రామం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకుంది. వేదపండితులు అమ్మవారికి గణపతి పూజ, పుణ్య హవచనం, అభిషేకాలు, విశేష అలంకరణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పంచాయతీతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు యోగాంధ్ర ర్యాలీ

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ఉదయం 8 గంటలకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించబడుతుందని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి కొనసాగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



అనంతసాగరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద వెలసి ఉన్న ప్రముఖ సోమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సోమసుందరమూర్తి, విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు కాసులపేరు బహూకరణ



అమ్మవారికి బంగారు కాసులపేరును అందజేస్తున్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు 176 గ్రాముల బంగారు కాసులపేరు మాల బహూకరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మేళతాళాల నడుమ కాసుల పేరు, కాసులను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.